### టాటా కెమికల్స్‌కు చంద్రశేఖరన్ రాజీనామా?

టాటా కెమికల్స్ బోర్డు నుంచి వైదొలగుతున్న ఎన్ చంద్రశేఖరన్ అనేక విషయాల్లో చరిత్ర సృష్టిం చారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఆయన కొత్త అధ్యాయాన్ని ప్రారం భించారు. టాటా కుటుంబం వెలుపలి వ్యక్తి టాటా సన్స్ చైర్మన్ కావడం ఇదే తొలిసారి. టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ టాటా కెమికల్స్ బోర్డు డైరెక్టర్, ఛైర్మన్ పదవి నుంచి వైదొలిగారు. ఆయన మే 29న ఆ పదవి నుంచి వైదొలగనున్నారు. తన ఇతర బాధ్యతలను పేర్కొంటూ చంద్రశేఖరన్ టాటా కెమికల్స్‌లో ఉన్నత పదవికి రాజీనామా చేశారు. కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆయన రాజీనామాను ధృవీకరించింది. "నా ప్రస్తుత, భవిష్యత్తు బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని బోర్డు నుండి వైదొలగాలని నిర్ణయించుకున్నాను."



ప్రభాత **సూర్య**

www.suryaa.news

తెలుగు జాతీయ దిన పత్రిక

వెల రూ.5/ - పేజీలు : 8 శుక్రవారం 30 మే 2025 సంపుటి: 01, సంచిక : 26



**విలేకరులు కావలెను**

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు

## భారతీయుల ఆత్మగౌరవం ట్రంప్ దగ్గర తాకట్టా?

- యుద్ధాన్ని అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారు? ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం
- రఫేల్ విమానాలు ఎన్ని నేలకూలాయో చెప్పాలి?
- యుద్ధ విరమణతో సైనికుల ఆత్మస్థైర్యం, ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారు
- ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశం.. మీ సొంత వ్యవహారం కాదు
- యుద్ధంపై ఉపన్యాసాలు కాదు.. ప్రధాని దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి
- మోదీకి వీరతిలకం దిద్దితే యుద్ధంలో వెనుకడుగు వేశారు
- పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి
- జైహింద్ యాత్ర అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి




సూర్య హైదరాబాద్


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో ప్రధాని మోదీ పాకిస్తాన్‌తో యుద్ధం విరమించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని, దేశ ప్రజల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీశారని మండిప డ్డారు. 'అమెరికా ఒత్తిడికి తలొగ్గి యుద్ధాన్ని అర్ధాంతరంగా ఆపేస్తారా? భారతీయుల ఆత్మగౌరవాన్ని ట్రంప్ దగ్గర తాకట్టు పెడ తారా? యుద్ధం అంటే ధైర్యం, వెన్నెముక, యుద్ధతంత్రం ఉండాలని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీ నాలుగు రోజుల యుద్ధం తర్వాత అర్ధాంతరంగా ఎందుకు ఆపేశారు? పాకిస్తాన్‌తో యుద్ధంలో రఫేల్ విమానాలు ఎన్ని - మిగతా2లో

3



## ముష్కరులను ఎగదోస్తే ఉగ్ర నరసింహావతారమే

- ఇప్పటికే మూడుసార్లు మన సైనికశక్తి రుచిచూపించాం
- శత్రువును మోకాళ్లపై కూర్చోబెట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదు
- పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది
- 'సిందూర్ ఖేలా' శక్తి ఏమిటో ఈ రాష్ట్ర మహిళలకు బాగా తెలుసు
- పాక్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యలు



## మేడిన్ ఇండియా చిప్ వచ్చేస్తోంది

- మోదీ సర్కారు మాస్టర్‌స్ట్రోక్
- కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- 'మేం ఓ విభాగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం
- దీనికి 60 శాతం మార్కెట్ ఉంది
- ప్రస్తుతం 6 యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి.

# భారాసను.. భాజపాకు అప్పగించే కుట్ర



- నేను జైల్లో ఉన్నప్పుడు ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు
- అప్పుడే బలంగా వ్యతిరేకించా
- మరి ఇప్పుడెందుకు అంత బలహీనత?
- పార్టీ బలోపేతం కోసం నేను రాసిన లేఖను లీక్ చేసిందెవరు?
- నన్ను మాటలంటున్న నాయకులు.. కేసీఆర్ నీడలో పనిచేశారే తప్ప వ్యక్తిగతంగా చేసిందేముంది?
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో భారాస ఎమ్మెల్సీ

సూర్య హైదరాబాద్

"తెలంగాణ వనరులను దోచుకునే ప్రయత్నం చేస్తున్న భాజపాను కట్టడి చేయకుండా.. గంపగుత్తగా భారాసను ఆ పార్టీకి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని నా భావన. నేను జైలులో ఉన్నప్పుడు ఇదే ప్రతిపాదనను నా వద్దకు తీసుకొచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ భారాసనే తెలంగాణకు శ్రీరామరక్ష అని చెప్పా. విలీనం చేయొద్దని ఆనాడు బలంగా కేసీఆర్‌ను కోరా. ఆరు నెలలు కాదు.. ఏడాదైనా జైలులో ఉంటా.. దయచేసి తొందరపాటు నిర్ణయం తీసుకోవద్దని ఆనాడు జైలు నుంచి వాదన వినిపించా. మరి ఇప్పుడెందుకు అంత బలహీనత? భారాసలో భాజపాకు కూడా కోవర్టులున్నట్లేనా? భాజ పా నాయకులు హాస్పిటల్స్ ప్రారంభిస్తే పోయింది ఎవరు? ఈ అంశాలన్నీ మాట్లాడించాలా - మిగతా2లో




## అభివృద్ధితోపాటు సంక్షేమమే లక్ష్యం

- పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు
- ఎరువుల కొరత రాకుండా చూడాలి
- ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు న్యాయం జరగాలి
- ఉమ్మడి జిల్లాల సమీక్ష సమావేశాల్లో మంత్రులు

3

## తెలంగాణ కాంగ్రెస్‌కు ఐదు కమిటీలు ప్రకటించిన ఏఐసీసీ

- పలు కమిటీలను కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు
- 22మందితో రాజకీయ వ్యవహారాల కమిటీ
- 15మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ

2



# స్వదేశానికి రండి

## ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టు ఆదేశం



- భారత్‌కు వచ్చిన 3 రోజుల్లోగా విచారణకు హాజరవ్వాలని వెల్లడి
- ఎస్ఐబీ మాజీ చీఫ్ పాస్‌పోర్టు పునరుద్ధరించాలని సిట్‌కు సూచన
- తదుపరి విచారణ వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దన్న ధర్మాసనం
- ఆయనను పారిపోయిన వ్యక్తిగా పరిగణించలేమని స్పష్టీకరణ
- ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణ ఆగస్టు 5కు వాయిదా

2



## ఉత్తమ నటుడు అల్లు అర్జున్

- ఉత్తమ నటి నివేదా థామస్.. ఉత్తేమ దర్శకుడు నాగ్‌అశ్విన్
- ఉత్తమ చిత్రాలుగా కల్కి, పొట్టేల్, లక్కీ భాస్కర్
- లక్కీభాస్కర్,కల్కికి 4 చొప్పున అవార్డులు
- జూన్ 14న ఘనంగా అవార్డుల ప్రదాన కార్యక్రమం
- గద్దర్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించిన జ్యూరీ

3

# ఎంఐఎంతో మన వైఖరి ఏంటి?

- ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి మేం వారితో కొట్లాడాలి.. ఎన్నికలయ్యాక ఆ పార్టీతో దోస్తానా ఎందుకు?
- జిల్లా మంత్రి పట్టించుకోరు.. సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వరు
- మీనాక్షి నటరాజన్‌కు హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మొర
- మంత్రుల నియోజకవర్గాలకు ఎక్కువ నిధులు తీసుకెళ్తున్నారని పాలమూరు ఎమ్మెల్యేల ఫిర్యాదు

2



# స్వదేశానికి రండి

న్యూఢిల్లీ

తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును భారతదేశానికి తిరిగి రావాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి ఉత్తర్వు లు వచ్చే వరకు ప్రభాకర్‌రావుపై ఎటువంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని దర్యాప్తు బృందానికి సూచించింది. పాస్‌పోర్టు రద్దు కా రణంగా ప్రభాకర్‌రావు స్వదేశానికి తిరిగి రా లేని పరిస్థితుల్లో ఆయనను పారిపోయిన వ్యక్తి గా పరిగణించలేరని స్పష్టం చేసింది. పాస్ పోర్టు లేదా ప్రయాణ పత్రం అందిన 3 రోజు ల్లోపు దేశానికి తిరిగి వస్తాననే హామీ పత్రం ఇవ్వాలని ప్రభాకర్‌రావుకు సూచించింది. ఈ ఆదేశాలను అడ్వాంటేజ్‌గా తీసుకోవద్దని తెలిపింది. తదుపరి విచారణను ఆగస్టు 5కు వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఆయన తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదించారు.

**పాస్‌పోర్టు పునరుద్ధరిస్తే వస్తారు**

ముప్పై సంవత్సరాల పాటు ప్రభుత్వ అధికారిగా సేవలందించిన ప్రభాకర్‌రావుపై తప్పు డు కేసులు పెట్టారని శేషాద్రినాయుడు చెప్పా రు. ఎఫ్ఐఆర్ సమయంలో ఆయన అమెరికా వెళ్లారని, దీంతో ఆయన్ను పరారీలో ఉన్న నిందితుడిగా ప్రకటించి పాస్‌పోర్టును రద్దు చేశారని తెలిపారు. ఆయన అమెరికా నుంచి తిరిగి వచ్చేందుకు అవకాశం లేకుండా పాస్‌పోర్టును రద్దు చేశారని తెలిపారు. పాస్‌పోర్టు పునరుద్ధరిస్తే భారత్‌కు తిరిగి వస్తారని, విచారణకు సహకరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కేసులో ఇప్పటికే పలువురికి బెయిల్ ఇచ్చారన్నారు.

**మధ్యంతర రక్షణ ఇవ్వొద్దు**

తెలంగాణ ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహా రం చాలా తీవ్రమైనదని, ప్రభాకర్‌రావుకు ఎటువంటి మధ్యంతర రక్షణ ఇవ్వరాదని అన్నారు. ఆయన పరారీలో ఉన్నందున ముందస్తు బెయిల్‌ను రాష్ట్ర ప్రభు త్వం వ్యతిరేకిస్తోందని చెప్పారు. ప్రభాకర్‌రావు పరారీలో ఉన్నట్లుగా ప్రకటి స్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసిందని తెలి పారు. ముందస్తు బెయిల్ కాకుండా రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించగా.. పిటిషనర్ తిరిగి వస్తే ఆయనను అరెస్టు చేయబోమని ప్రకటన చేసేం దుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని జస్టిస్ నాగరత్న ప్రశ్నించా రు. లేదని, ప్రభాకర్‌రావును అరెస్టు చేయాలని అనుకుంటున్నట్లు తుషార్ మెహతా చెప్పా రు. కేసు దర్యాప్తు అధికారి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కూడా ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్‌ను వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో జస్టిస్ నాగరత్న జోక్యం చేసుకున్నారు. 'ఆయన భారత్‌కు తిరిగి రాలేని పరిస్థితుల్లో ప్రభాకర్‌రావు చట్టానికి దూరంగా ఉన్నట్టు మీరు చెప్పలేరు. ఆయన పారిపోయిన వ్యక్తి కాదు'అని అన్నారు. వాదనల అనంతరం ప్రభాకర్‌రావు స్వదేశానికి తిరిగి వచ్చేందుకు వీలుగా ఆయన పాస్ పోర్టును పునరుద్ధరించాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ వరకు ఆయనను అరెస్టు చేయరాదని ప్రత్యేక దర్యాప్తు బృందానికి తెలిపింది. దేశానికి వచ్చిన మూడు రోజుల వ్యవధిలోనే దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని ప్రభాకర్‌రావుకు స్పష్టం చేసింది.

# భారాసను.. భాజపాకు అప్పగించే కుట్ర

-మొదటిపేజీ తరువాయి

మరి?" అని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నేను అడిగేది ఒక్కటే.. పార్టీ బలోపేతం కోసం రాసిన లేఖను లీక్ చేసింది ఎవరు? నా దగ్గరకు కేసీఆర్ దూతలుగా వచ్చినవారు చెప్పనటువంటి అంశాలు చెప్పినట్లుగా రాయించింది ఎవరు?' అని నిలదీశారు. 'నేను కేసీఆర్ లాగా చాలా తిక్కదాన్ని. పదవులు, పైసలు అవసరం లేదు. ఆత్మగౌరవం, ఆత్మాభిమానం కోరుకుంటా. వెన్నుపోటు రాజకీయాలు చేయను" అని తెలిపారు. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కవిత గురువారం మీడియాతో పలు అంశాలపై ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పరోక్షంగా భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**కేసీఆర్‌కు నోటీసులిస్తే కార్యాచరణ ఏదీ..?**

"ప్రాణాలొడ్డి తెలంగాణను సాధించి, అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులిస్తే.. భారాస ఏం కార్యాచరణ తీసుకుంది? రాష్ట్రస్థాయిలో నిరసన తెలపొద్దా? కేవలం 'ఎక్స్'లో సందేశాలు పెట్టి చేతులు దులుపుకొంటే బాగుంటుందా? క్షేత్రస్థాయిలో ఉద్యమాలు ఎందుకు చేయలేకపోతున్నాం? అదే మరో నాయకుడికి నోటీసులొస్తే విపరీతంగా స్పందించారు. నేను పార్టీ వ్యతిరేక కార్యాచరణ చేస్తున్నట్లు కొంతమంది పెయిడ్ సోషల్ మీడియా కార్యకర్తలతో ఇంటి ఆడబిడ్డ మీద ఎటుపడితే అటు మాట్లాడిస్తే అది మర్యాదనా? భారాస రజతోత్సవ సంబురాలు అమెరికాలో ఎందుకు? ఇక్కడ ఎందుకు చేయడం లేదు?

**ఆ రోజే రాజీనామా చేస్తానన్నా..**

దిల్లీ లిక్కర్ పాలసీ వ్యవహారంలో నా మీద ఆరోపణలు వచ్చిన రోజే.. కేసీఆర్ వద్దకు వెళ్లి.. ఎమ్మెల్సీ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తానని చెప్పా. 'నన్ను ఎదుర్కొనే దమ్ము లేక.. నీ మీద కుట్రపూరితంగా కేసు పెడుతున్నారు.. రాజీనామా చేయాల్సిన అవసరం లేదు' అని కేసీఆర్ వారించారు. నన్ను జైలుకు తీసుకెళ్లే సందర్భంలోనూ.. రాజీనామా చేయమంటారా? అని



మరోసారి అడిగినా అవసరం లేదన్నారు. పార్టీలో కొందరు కుట్రపూరితంగా ఎంపీగా ఓడిస్తే.. మళ్లీ నాకు నిజామాబాద్ పార్లమెంటు ఇన్‌ఛార్జిగా ఇవ్వాలని కేసీఆర్‌ను కోరా. అప్పుడు ఆయన స్పందిస్తూ.. 'ఎమ్మెల్యేలు నీకు పనిచేయలేదని నాకు లేట్‌గా తెలిసింది.. కాబట్టి నీకు అదే జిల్లాలో ప్రొటోకాల్ ఉంటే.. సరిగ్గా పనిచేయగలుగుతావు' అని చెప్పి.. పాలసీ నిర్ణయం తీసుకొని ఎమ్మెల్సీ ఇచ్చారు తప్ప.. నేను ఏనాడూ పదవుల కోసం పనిచేయలేదు.

**ఆడబిడ్డపై ప్రతాపమా?**

తెలంగాణ ఉద్యమ సమయంలో నేను కడుపులో బిడ్డను పెట్టుకొని.. సైనికురాలిలాగా పనిచేశా. వ్యక్తిగతంగా అనేక కార్యక్రమాలు చేశా. కానీ, ఇప్పుడు నన్ను రకరకాల మాటలంటున్న నాయకులు.. కేసీఆర్ నీడలో పనిచేశారే తప్ప.. వ్యక్తిగతంగా వారు చేసిన కార్యక్రమం ఏముంది? నాపై మీ పెయిడ్ ఆర్టిస్టులతో ప్రతాపం చూపిస్తే.. నేను అసలే మంచిదాన్ని కాదు. మాట్లాడడం మొదలుపెడితే బాగుండదు. ఏమన్నా అంటే నువ్వు లేఖ ఎందుకు రాశావ్? అంటున్నారు. కేసీఆర్‌కు వందల లేఖలు రాశా. మా నాన్నకు నేను రాసుకుంటా.. మీకేం నొప్పి? సాధారణంగా లేఖను చదివిన తర్వాత కేసీఆర్ చించుతారు. కానీ, ఈ సారి నా కర్మ బాగోలేదో.. ఇంకెవరి కర్మ బాగోలేదో కానీ.. ఆయన చించకుండా అలా పెట్టారు. నేను పార్టీ అధ్యక్షుడికి రాయలేదు. మా నాన్నకే రాశా. లేఖలో ఏమైనా ఒక్క అంశమైనా తప్పుందా? దేశం వెలుపల మీడియా సెల్‌లు పెట్టుకొని.. అక్కడ్నించి దొంగదెబ్బ తీస్తామనే తెలివితేటలను బయటి వాళ్ల మీద ప్రయోగించండి.

**కేసీఆర్‌ను మోసేంత పెద్దోళ్లు అయ్యారా?**

కాంగ్రెస్ నాయకులతో కొందరు.. భాజపా నేతలతో కొందరు కలిసి ఉంటున్నారు. నాకు నీతులు చెప్పిన నాయకులు పెంచి పోషించిన పెట్టుబడిదారులు.. పార్టీకి పార్లమెంటు సభ్యులు అవసరమైనప్పుడు ఎక్కడికి పోయారు? నాయకుడిని కూడా మేమే మోస్తున్నామని కార్టూన్లు వేయించుకొని ప్రచారం చేసుకుంటారా? కేసీఆర్‌ను మోసేంత పెద్దోళ్లు అయిపోయారా? నాపై గత కొంతకాలంగా దుష్ప్రచారం చేస్తున్నా.. పార్టీ స్పందించలేదు. అదే మరో సీనియర్ నేతపై ఇలాంటి ప్రచారమే జరిగితే స్పందించారు. నాపై జరుగుతున్న దుష్ప్రచారంపై పార్టీ స్పందిస్తుందని ఆశిస్తున్నా. ఏదైనా విషయముంటే.. నేరుగా మాట్లాడాలి. మీడియాలోనే మాట్లాడుతామంటే.. నేను కూడా మీడియాలోనే మాట్లాడతా. నన్ను పార్టీ నుంచి బయటకు ఎవరు పంపుతారు? అంత సీన్ లేదు" అని కవిత వ్యాఖ్యానించారు.

**కేసీఆర్ తప్ప మరెవరి నాయకత్వంలో పనిచేయను**

"కాంగ్రెస్ మునిగే పడవ. ఆ పార్టీ గట్టిగా ఉంటే కేంద్రంలో భాజపా ఇన్నిసార్లు గెలిచేదే కాదు. అటువంటి వాళ్లతో నేను రాయబారాలు నడిపేది లేదు. నా పార్టీ భారాస. నా నాయకుడు కేసీఆర్ మాత్రమే. ఆయన తప్ప మరే నాయకుడి దగ్గర పనిచేయను. కొత్త పార్టీ ఎందుకు? ఉన్న పార్టీని బాగా కాపాడుకుంటే చాలు. నా మీద కుట్ర చేస్తే అత్యధికంగా రాజకీయ లాభం ఎవరికి జరుగుతుందో.. నాకు నీతి వ్యాక్యాలు చెప్పే వారు ఆలోచించుకోవాలి. నన్ను, కేసీఆర్‌ను విడదీసే కుట్ర చేస్తున్నారు. దాన్ని అడ్డుకోవాలని అడుగుతున్నా" అని కవిత పేర్కొన్నారు.

# దేశ భద్రత విషయంలో రాజకీయాలకు తావులేదు

-మొదటిపేజీ తరువాయి

నేలకూలాయో లెక్క చెప్పాలి' అని డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం బాచుపల్లి వీఎన్‌ఆర్ జ్యోతి ఇంజనీరింగ్ కాలేజీ నుంచి కేజీఆర్ కన్వెన్షన్ వరకూ జైహింద్ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలోని యుద్ధ విమానాలే పాకిస్తాన్‌తో యుద్ధంలో దేశ ఆత్మ గౌరవాన్ని కాపాడాయని, మోదీ కొనుగోలు చేసిన రఫేల్ విమానాలు మాత్రం యుద్ధంలో నేలకూలాయని ఎద్దేవా చేశారు. యుద్ధం చేయాలనుకున్నప్పుడు అఖిలపక్షాన్ని పిలిచారని.. యుద్ధం ఆపేసినప్పుడు అఖిలపక్షాన్ని ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. యుద్ధంపై ఉపన్యాసాలు చెప్పడం కాదు. దేశ ప్రజలకు మోదీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

**ఇందిరను స్ఫూర్తిగా తీసుకోవాలి**

పాకిస్తాన్‌తో యుద్ధంలో అపరకాళీ ఇందిరా గాంధీని ప్రధాని మోదీ స్ఫూర్తిగా తీసుకుంటే బాగుండేదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగినప్పుడు యుద్ధం ఆపాలని ఇందిరా గాంధీని అప్పటి అమెరికా అధ్యక్షుడు బెదిరించారని, కానీ ఆమె అమెరికా బెదిరింపులకు లొంగలేదన్నారు. భారత్ వైపు ఎవరు కన్నెత్తి చూసినా కనుగుడ్లు పీకేస్తామని.. చైనాకు ఇందిరాగాంధీ వార్నింగ్ కూడా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

ఆనాడు చైనాపై యుద్ధం ప్రకటించి గట్టిగా బుద్ధి చెప్పిన ఘనత ఇందిరమ్మదన్నారు. భారత ఆర్మీ కల్నల్




సంతోష్‌ను చైనా పొట్టన పెట్టుకుంటే మోదీ కనీసం చైనాకు బుద్ధి చెప్పే ప్రయత్నం కూడా చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 1971లో భారత్%-%పాక్ యుద్ధ సమయంలో అమెరికా మధ్యవర్తిత్వం అవసరం లేదని ఇందిరా గాంధీ నిర్మొహమాటంగా చెపారని, యుద్ధంలో ఇందిరమ్మ పాకిస్తాన్‌ను రెండు ముక్కలు చేసి చూపారన్నారు. ఇందిరమ్మ స్ఫూర్తితో పాక్‌ను రెండు ముక్కలు చేయాలని.. తాము మద్దతుగా ఉంటామని చెప్పారు. పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని రేవంత్ కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలుపుకొనేందుకు పాక్‌పై యుద్ధం చేయాలని, రాజకీయాలకు అతీతంగా అండగా ఉంటామని చెప్పామన్నారు. భారత్‌పై పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పేట్రేగిపోతున్నారని, ఉగ్రవాదులను తుదముట్టించే వరకూ సైన్యానికి అండగా ఉంటామని తెలిపారు.

**రాహుల్ గాంధీపై విమర్శలా?**

అమెరికాకు తలొగ్గి యుద్ధం విరమించిన బీజేపీ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై విమర్శలు చేయడం విడ్డురంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. భారత్ 1967లో చైనాను, 1971లో పాకిస్తాన్‌ను ఓడించినందుకు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్నారా ఎద్దేవాచేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది, గాంధీ కుటుంబానిదన్నారు. మోదీకి వీరతిలకం దిద్ది పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలని చెబితే.. ఎందుకు వెనుకడుగు వేశారో బీజేపీ నేతలే చెప్పాలన్నారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అంశమని, మీ సొంత వ్యవహారం కాదని ధ్వజమెత్తారు. గుండెల్లో ధైర్యం ఉన్న నాయకుడే యుద్ధాన్ని గెలిపిస్తారన్నారు. భారత సైనికుల ఆత్మస్థైర్యాన్ని బీజేపీ దెబ్బతీస్తే.. వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు కాంగ్రెస్ జైహింద్ యాత్ర చేపట్టిందని చెప్పారు. రాహుల్ గాంధీని దేశానికి ప్రధానిగా చూసే వరకు మనం విశ్రమించొద్దని పార్టీ కార్యకర్తలకు రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఎంఐఎంతో మన వైఖరి ఏంటి?

హైదరాబాద్

ఎంఐఎం విషయంలో పార్టీ వైఖరేంటో స్పష్టం చేయాలని హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కోరారు. ఎన్నికల సమయంలో తాము ఎంఐఎంతో ప్రాణాలకు తెగించి కొట్లాడతామని, ఎన్నికలయ్యాక కాంగ్రెస్ ముఖ్యనేతలు ఆ పార్టీతో దోస్తానా చేస్తారని, ఇలాగైతే హైదరాబాదులో పార్టీ ఎలా అభివృద్ధి అవుతుందని వారు ప్రశ్నించారు. ఎంఐఎం విషయంలో ఒక వైఖరి తీసుకుని ముందుకెళ్తే తాము కూడా రాజకీయంగా ఏం చేయాలనేది నిర్ణయించుకుంటామని స్పష్టం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులతో భేటీ అవుతున్న మీనాక్షి నటరాజన్ రెండో రోజు గురువారం మహబూబ్‌నగర్, చేవెళ్ల, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని నేతలతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ నేతలు ఎంఐఎం అంశాన్ని ఆమె వద్ద ప్రస్తావించినట్టు తెలిసింది.

**జిల్లాలో పార్టీకి పెద్దదిక్కు లేదు.**

'హైదరాబాద్ జిల్లాలో పార్టీకి పెద్దదిక్కు లేదు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా ఇంతవరకు హైదరాబాద్ జిల్లాకు చెందిన ఒక నాయకుడికి కూడా నామినేటెడ్ పదవి ఇవ్వలేదు. ఎంఐఎంతో కొట్లాడినప్పుడు మా మీద కేసులు పెట్టారు. ఆ కేసులు ఎత్తేయాలని కోరినా పట్టించుకునే నాథుడు లేడు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మమ్మల్ని కలవరు. సీఎం అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వరు' అని మీనాక్షి నటరాజన్ వద్ద హైదరాబాద్ నేతలు మొరపెట్టుకున్నట్టు తెలిసింది. వారి విజ్ఞాపనలు విన్న మీనాక్షి అన్ని అంశాలు పార్టీతో మాట్లాడతానని, హైదరాబాద్ జిల్లాలో పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్దామని చెప్పినట్లు తెలిసింది. చేవెళ్ల, మహబూబ్‌గర్ లోక్‌సభ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు కూడా మీనాక్షితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత గురించి వారితో మాట్లాడినట్టు తెలిసింది. పాలమూరు లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మంత్రులు తమ నియోజకవర్గాలకు అధిక నిధులు తీసుకెళ్తున్నారని, దీనివల్ల తమకు నష్టం జరుగుతోందని, మంత్రులతో సమానంగా పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల కూడా నిధులిచ్చేలా చూడాలని మీనాక్షిని కోరినట్లు తెలిసింది.

## తెలంగాణ కాంగ్రెస్‌కు ఐదు కమిటీలు ప్రకటించిన ఏఐసీసీ

దిల్లీ

తెలంగాణ కాంగ్రెస్‌లో ఐదు కమిటీలను కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసింది. 22మందితో రాజకీయ వ్యవహారాల కమిటీ, 15మందితో సలహా కమిటీ, ఏడుగురితో డీలిమిటేషన్ కమిటీ, 16మందితో సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ, ఆరుగురితో క్రమశిక్షణా చర్యల కమిటీలను నియమిస్తూ గురువారం రాత్రి ఏఐసీసీ ప్రకటన విడుదల చేసింది.

**రాజకీయ వ్యవహారాల కమిటీలో ఉన్నది వీరే..**

రాజకీయ వ్యవహారాల కమిటీలో మీనాక్షి నటరాజన్, బి.మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, చల్లా వంశీచంద్ రెడ్డి, జి.రేణుకా చౌదరి, బలరాం నాయక్, డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, షబ్బీర్ అలీ, అజహరుద్దీన్, ఆది శ్రీనివాస్, శ్రీహరి ముదిరాజ్, బీర్ల ఐలయ్య, పి.సుదర్శన్ రెడ్డి, కె.ప్రేమ్‌సాగర్ రావు, జెట్టి కుసుమ్ కుమార్, ఎరవర్తి అనిల్ కుమార్ ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రత్యేక ఆహ్వానితులుగా క్యాబినెట్ మంత్రులు ఉంటారు.

**అడ్వైజరీ కమిటీ**

మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, వి.హనుమంతరావు, జానారెడ్డి, కె.కేశవరావు, మధుయాష్కీ గౌడ్, జి.చిన్నారెడ్డి, జె.గీతారెడ్డి, ఎం. అంజన్‌కుమార్ యాదవ్, టి.జయప్రకాశ్ రెడ్డి, జాఫర్ జావేద్, టి. జీవన్ రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, రాములు నాయక్

**డీలిమిటేషన్ కమిటీ**

చల్లా వంశీచంద్ రెడ్డి (ఛైర్మన్), గద్వాల విజయలక్ష్మి, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, డా. శ్రవణ్ కుమార్ రెడ్డి, పవన్ మల్లాది, డి.వెంకటరమణ

**సంవిధాన్ బచావో ప్రోగ్రామ్ కమిటీ**

పి. వినయ్ కుమార్ (ఛైర్మన్), అద్దంకి దయాకర్, కె.శంకరయ్య, ఎన్.బాలు నాయక్, ఎ.నర్సిరెడ్డి, ఆత్రం సుగుణ, రాచమళ్ల సిద్దేశ్వర్, సంతోష్ కొలకొండ, డా.పులి అనిల్ కుమార్, జూలూరి ధనలక్ష్మి, మజీద్ ఖాన్, జి.రాములు, అర్జున్ రావు, శౌరి, కొల్లం వల్లభ్ రెడ్డి, వి.శ్రీకాంత్ రెడ్డి

**క్రమశిక్షణా చర్యల కమిటీ**

మల్లు రవి (ఛైర్మన్), ఎ.శ్యామ్ మోహన్ (వైస్ ఛైర్మన్), ఎం.నిరంజన్ రెడ్డి, బి.కమలాకర్‌రావు, జాఫర్ జావేద్, డా.జీవీ రామకృష్ణ

## 'నంబాల' అస్థికలకు న్యాయపోరాటం

భద్రాద్రి కొత్తగూడెం

మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు అస్థికల కోసం కుటుంబ సభ్యులు న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల చనిపోగా.. ఆయన మృతదేహానికి పోలీసులే 26వ తేదీన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనతో పాటు మరికొందరి అంత్యక్రియలు కూడా పూర్తి చేశారు. అయితే అస్థికలను కుటుంబసభ్యులకు అప్పగించే విషయంలో.. మరోసారి వివాదం చెలరేగినట్టు బస్తర్, జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

**ఆదివాసీ శ్మశానవాటికలో..**

ఈనెల 21న నంబాలతో పాటు 28మంది మావోయిస్టులు చనిపోగా అందులో 27మంది మృతదేహాలకు నారాయణపూర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురి మృతదేహాలు ఉన్నాయి. వీరి మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకెళ్లేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి ఫ్రీజర్లతో కూడిన మూడు అంబులెన్సులు 22వ తేదీ సాయంత్రం నాటికి నారాయణపూర్ చేరుకున్నాయి. కాగా, మృతులతో తమకున్న రక్త సంబంధం నిరూపించుకునేందుకు చట్టపరమైన ఆధారాలు (ఆధార్ కార్డ్, ఫ్యామిలీ ఫొటో, సర్పంచ్ ధ్రువీకరణ పత్రం) సమర్పించలేదనే కారణంతో.. 26వ తేదీన సాయంత్రం పోలీసులే మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. నారాయణపూర్‌లోని ఆదివాసీ శ్మశానవాటికలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదుగురు మావోయిస్టులతో పాటు మరో ముగ్గురు ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ మృతదేహాలకు అంత్యక్రియలు జరిగాయి.

**డిక్లరేషన్ పేచీ..**

అంత్యక్రియలు జరిగిన మర్నాడు.. నంబాల కేశవరావు సోదరుడు నంబాల రామ్‌ప్రసాద్ ఛత్తీస్‌గఢ్ పోలీసులను ఆశ్రయించి తన సోదరుడి అస్థికలు ఇవ్వాలని కోరారు. కాగా, తమ కుటుంబ సభ్యుడేనని నిరూపించుకునేందుకు అవసరమైన చట్టపరమైన పనులు నిర్వర్తించడంలో విఫలమైనట్లు డిక్లరేషన్ పత్రంపై సంతకం చేయాలని అక్కడి పోలీసులు సూచించినట్లు సమాచారం. దీనికి నిరాకరించిన నంబాల సోదరుడు మరోసారి న్యాయపరంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఎనిమిది మంది మృతదేహాలకు పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. అందులో మావోయిస్టు హుంగీ కుటుంబ సభ్యులు.. తమ ఆర్థిక సమస్యల రీత్యా.. పోలీసులే నిర్వహించాలని కోరారు. కానీ అంత్యక్రియలకు ముందు ఒక్కసారైనా హుంగీ మృతదేహాన్ని తమకు చూపలేదని వారు వాపోయారు. ఏళ్ల తరబడి ఇంటికి దూరమై విగత జీవులుగా మారిన తమ వారికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలనే లక్ష్యంతో ఫ్రీజర్ బాక్స్‌లున్న అంబులెన్సులు తెచ్చుకున్నామని, కానీ ఉత్త చేతులతో తిరుగు ముఖం పట్టాల్సి వచ్చిందని తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉత్తమ నటుడు అల్లు అర్జున్

హైదరాబాద్

పుష్ప-2 సినిమాలో నటనకుగాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా గద్దర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ నటి అవార్డును నివేదా థామస్ (35 చిన్న కథ కాదు) గెలుచుకున్నారు. ప్రజా వాగ్గేయకారుడు, ఉద్యమకారుడు గద్దర్ పేరుపై ఏర్పాటుచేసిన సినిమా అవార్డులను తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజుతో కలసి గద్దర్ అవార్డుల జ్యూరీ చైర్‌పర్సన్, నటి జయసుధ గురువారం అవార్డుల వివరాలను ప్రకటించారు. మొదటి ఉత్తమ చిత్రంగా కల్కి 2898ఏడీ, రెండో ఉత్తమ చిత్రంగా పొట్టేల్, మూడో ఉత్తమ చిత్రంగా లక్కీ భాస్కర్ అవార్డులు గెలుచుకున్నాయి. మొత్తం 11 కేటగిరీల్లో 1,248 నామినేషన్లు వచ్చినట్లు జయసుధ తెలిపారు. దాదాపు 14 ఏళ్ల తర్వాత తెలుగు సినిమా అవార్డులను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. వచ్చేనెల 14వ తేదీన విజేతలకు గద్దర్ అవార్డులను ప్రదానం చేయనున్నారు.



**రెండు చిత్రాలకు నాలుగేసి అవార్డులు**

గద్దర్ అవార్డుల్లో కల్కి 2898ఏడీ, లక్కీ భాస్కర్ సినిమాలు నాలుగు కేటగిరీల్లో అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్, స్పెషల్‌జ్యూరీ అవార్డులు లక్కీ భాస్కర్ చిత్రానికి దక్కాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తం ఆర్ట్ డైరెక్టర్, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్ కేటగిరీల్లో కల్కి అవార్డులు గెలుచుకుంది. రజాకార్ సినిమా చారిత్రక విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం అవార్డుతోపాటు ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ విభాగంలో అవార్డులు దక్కించుకుంది. అన్ని కేటగిరీల్లోనూ 2024కు సంబంధించి గద్దర్ సినిమా అవార్డులను ప్రకటించారు. 14 ఏళ్ల తర్వాత ప్రభుత్వం సినిమా అవార్డులు ఇవ్వబోతోందని దిల్ రాజు తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలు లేకుండా స్వేచ్ఛగా ఎంపిక జరిగిందని చెప్పారు. పారదర్శకంగా స్క్రీనింగ్ చేసి బెస్ట్ ఆఫ్ బెస్ట్‌ను ఎంపిక చేసినట్లు జయసుధ వివరించారు. 2014, జూన్ నుంచి 2023, డిసెంబర్ వరకు విడుదలైన ఉత్తమ చిత్రాలకు త్వరలో అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. అవార్డులు ఇవ్వడం సంతోషంగా ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**చిత్రాల విభాగంలో అవార్డులు**

మొదటి ఉత్తమ మొదటి చిత్రం: కల్కి
రేండో ఉత్తమ చిత్రం: పొట్టేల్
ఉత్తమ మూడవ చిత్రం: లక్కీ భాస్కర్
జాతీయ సమైక్యత, మత సామరస్యం, అణగారిన వర్గాల అభ్యున్నతిపై బెస్ట్ ఫీచర్ ఫిల్మ్: కమిటీ కుర్రోళ్లు
ఉత్తమ బాలల చిత్రం: 35 చిన్న కథ కాదు
ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు: యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)
ఉత్తమ వినోదాత్మక చిత్రం: ఆయ్
చారిత్రక విభాగంలో ఫీచర్ హెరిటేజ్ చిత్రం: రజాకార్

**వ్యక్తిగత విభాగంలో అవార్డులు**

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప 2)
ఉత్తమ నటి: నివేదా థామస్ (35 చిన్న కథ కాదు)
ఉత్తమ దర్శకుడు: నాగ్ అశ్విన్ (కల్కి)
ఉత్తమ సహాయ నటుడు: ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం)
ఉత్తమ సహాయ నటి: శరణ్యా ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్)
ఉత్తమ సంగీత దర్శకుడు: భీమ్స్ (రజాకార్)
ఉత్తమ నేపథ్య గాయకుడు: సిద్ శ్రీరామ్ (ఊరి పేరు భైరవకోన%-%నిజమే నే చెబుతున్నా..)
ఉత్తమ నేపథ్య గాయని: శ్రేయా ఘోషల్ (పుష్ప 2%-% సూసేటి అగ్గిరవ్వ)
ఉత్తమ హాస్యనటులు: సత్య, వెన్నెల కిశోర్ (మత్తు వదలరా%-2)
ఉత్తమ బాలనటులు: మాస్టర్ అరుణ్ దేవ్ పోతుల (35 ఇది చిన్న కథ కాదు), బేబీ హారిక (మెర్సీ కిల్లింగ్)
ఉత్తమ కథా రచయిత: శివ పాలడుగు (మ్యూజిక్ షాప్ మూర్తి)
ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: వెంకి అట్లూరి (లక్కీ భాస్కర్)
ఉత్తమ గేయ రచయిత: చంద్రబోస్ (రాజు యాదవ్)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: విశ్వనాథ్ రెడ్డి (గామి)
ఉత్తమ ఎడిటర్: నవీన్ నూలి (లక్కీ భాస్కర్)
ఉత్తమ ఆడియోగ్రాఫర్: అరవింద్ మేనన్ (గామి)
ఉత్తమ కొరియోగ్రాఫర్: గణేశ్ ఆచార్య (దేవర)
ఉత్తమ ఆర్ట్ డైరెక్టర్: నితిన్ జిహానీ చౌదరీ (కల్కి)
ఉత్తమ యాక్షన్ కొరియోగ్రాఫర్: కె. చంద్రశేఖర్ రాథోడ్ (గ్యాంగ్‌స్టర్)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: నల్ల శ్రీను (రజాకార్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: అర్చనా రావు, అజయ్ కుమార్ (కల్కి)

**స్పెషల్ జ్యూరీ అవార్డులు**

దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్)
అన్యన్య నాగళ్ల (పొట్టేల్)
సుజిత్, సందీప్ (కేవ)
ప్రశాంత్‌రెడ్డి, రాజేశ్ (రాజు యాదవ్)
స్పెషల్ మెన్షన్: ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా%-2)
తెలుగు సినిమాలపై ఉత్తమ పుస్తకం: మన సినిమా ఫస్ట్ రీల్ (రెంటాల జయదేవ్)

# అభివృద్ధితోపాటు సంక్షేమమే లక్ష్యం

హైదరాబాద్/కరీంనగర్/ నిజామాబాద్

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తూ అర్హులకు ఫలాలు అందేలా చూడాలని అధికారులకు మంత్రులు స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై ఇన్‌ఛార్జి మంత్రుల జిల్లా పర్యటనలు గురువారం ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో ఇన్‌ఛార్జి మంత్రులు ఆయా జిల్లాలకు వెళ్లారు. వారితోపాటు జిల్లాల మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు, భూభారతి, వానాకాలం పంటల సన్నద్ధత, ప్రజారోగ్యంపై మంత్రులు జిల్లాల వారీగా సమీక్షించారు. అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. తొలిరోజు ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఈ సమావేశాలు జరిగాయి.



**ఇందిరమ్మ ఇళ్లలో ఆలస్యం చేయొద్దు: పొంగులేటి**

హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి... మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. ఆరు జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ధాన్యం కొనుగోళ్లు, మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణపై ప్రధానంగా చర్చించారు. భూసేకరణను త్వరితగతిన పూర్తిచేసి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ఆలస్యం అవుతోందంటూ కలెక్టర్లపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం అమలులో సమస్యలేమిటని, పనితీరు మార్చుకోకుంటే ఇబ్బందులు పడతారంటూ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రంలోగా లబ్ధిదారుల జాబితాలను ఎమ్మెల్యేలకు అందివ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. మంజూరైన ఇళ్ల గ్రౌండింగ్ జూన్ 6వ తేదీలోగా జరగాలని స్పష్టం చేశారు. ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో వర్షాలతో తడుస్తున్న ధాన్యాన్ని వెంటనే తరలించాలని అధికారుల్ని మంత్రి ఆదేశించారు.

**రాజీవ్ వికాసానికి బ్యాంకర్లు సహకరించాలి: శ్రీధర్‌బాబు**

కొంగరకలాన్‌లోని రంగారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు... అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి రాజీవ్ యువవికాసం, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, ఖరీఫ్ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజీవ్ యువవికాసంలో లబ్ధిదారులకు బ్యాంకర్ల నుంచి సిబిల్ స్కోర్ వంటి సాంకేతికంగా సమస్యలు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. భూభారతిని జూన్ మూడు నుంచి అన్ని మండలాల్లో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 17,440 ఇళ్లను మంజూరు చేయగా 4,084 ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయినట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.

**ప్రజారోగ్యానికి మరిన్ని నిధులు: భట్టి**

ఖమ్మంలో సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క... ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు... ప్రభుత్వ పథకాల అమలు తీరు, లక్ష్యాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం అంశాల వారీగా అధికారులతో మంత్రులు సమీక్షించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించకుండా ప్రత్యేక బృందాలను నియమించాలని పోలీసు అధికారులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగారు. జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల కల్పనకు మరిన్ని నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన మొత్తం 885 ఇళ్ల నిర్మాణాల్లో 486 నిర్మాణాలు ప్రారంభం అయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన లబ్ధిదారులంతా ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చూడాలని, అవసరమైన వారికి బ్యాంకులు, మహిళా సంఘాల నుంచి రుణాలు ఇప్పించాలని మంత్రులు సూచించారు.

**కలెక్టర్లే బాధ్యత వహించాలి: ఉత్తమ్**

కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో పథకాల పురోగతిపై ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి... జిల్లా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, భూభారతి, వానాకాలం పంట సన్నద్ధతపై అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. అంశాలవారీగా పురోగతిని కలెక్టర్లు మంత్రులకు వివరించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఎక్కడైనా అర్హులకు అన్యాయం జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లాల కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కనిపిస్తున్న పురోగతిని ఆయన ప్రశంసించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులివ్వాలని ఎమ్మెల్యేలు కోరగా.. వాటి ప్రతిపాదనలు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఉత్తమ్ ఆదేశించారు. జిల్లాలవారీగా ఎరువుల నిల్వలపై కలెక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

**లబ్ధిదారులను ప్రోత్సహించండి: జూపల్లి**

నిజామాబాద్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు... ఉమ్మడి జిల్లాలోని ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, రాజీవ్ యువవికాసంపై సమీక్షించారు. ధాన్యం సేకరణలో నిజామాబాద్ జిల్లా ముందంజలో ఉండటంపై అధికార యంత్రాంగాన్ని ప్రశంసించారు. ధాన్యం సేకరణ లక్ష్యం 8 లక్షల టన్నులైతే ఇప్పటికే 8.21 లక్షల టన్నులు సేకరించామని, 3,569 మందికి ఇళ్లను మంజూరు చేస్తే 991 మంది పనులు ప్రారంభించారని అధికారులు వివరించారు. ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక, మొరం అందుబాటులో ఉండేలా చూడాలని, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని పక్కాగా అమలు చేసి, నిరుద్యోగులకు బాసటగా నిలవాలన్నారు

## మేడిన్ ఇండియా చిప్ వచ్చేస్తోంది

ఈ సంవత్సరం ఆఖరు నాటికి తొలి మేడిన్ ఇండియా చిప్‌ను తీసుకురానున్నట్లు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దేశ సాంకేతిక రంగ స్వావలంబనలో ఇది కీలకమైన ముందడుగా నిలుస్తుందని చెప్పారు. సీఐఐ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన.. సెమీకండక్టర్ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'మేం ఓ విభాగంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. దీనికి 60 శాతం మార్కెట్ ఉంది. ప్రస్తుతం 6 యూనిట్లు నిర్మాణంలో ఉన్నాయి. తొలి మేడిన్ ఇండియా 28-90 ఎన్ఎం చిప్‌ను ఈ ఏడాదిలోనే అందుబాటులోకి తీసుకొస్తాం. 2022లోనే దీని తయారీని మొదలుపెట్టాం' అని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

**రెండూ కీలకమే..**

సేవా రంగం మీద ఫోకస్ చేయాలని చాలా మంది ఆర్థికవేత్తలు సూచించారని మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. అయితే సేవా రంగంతో పాటు ఉత్పాదకత మీద దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని.. గణనీయ అభివృద్ధికి ఈ రెండూ కీలకమని మంత్రి పేర్కొన్నారు. దొరికిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌కు ప్రత్యేకమైన ఇంటర్నెట్ ప్రోటోకాల్, ప్రొడక్ట్, డిజైన్, స్టాండర్డ్స్ ఉండాలని.. వీటి ఆవశ్యకత ఉందన్నారు అశ్వినీ వైష్ణవ్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా భారీ మార్పులకు అవకాశం ఏర్పడిందన్నారు. అన్ని రంగాలతో పాటు మన సమాజంలోనూ ఏఐ గణనీయ మార్పులు తీసుకురాబోతోందని పేర్కొన్నారు. ఈ మార్పులకు అందరమూ సంసిద్ధంగా ఉండాలన్నారు. భారతీయ సంస్కృతి, భాషలపై ప్రత్యేకమైన ఏఐ మోడల్స్‌ను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు అశ్వినీ వైష్ణవ్

## ముష్కరులను ఎగదోస్తే ఉగ్ర నరసింహావతారమే

అలీపుర్‌ద్వార్

ఉగ్రవాదుల్ని పెంచిపోషించి పొరుగుదేశాలపైకి ఉసిగొలిపితే భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రధాని మోదీ మరోసారి గట్టిగా హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌ద్వార్‌లో గురువారం నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. శత్రువును మోకాళ్లపై కూర్చోబెట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని బెంగాల్ గడ్డ మీద నిలబడి, 140 కోట్ల మంది భారతీయుల తరఫున ప్రకటిస్తున్నానని ప్రధాని మోదీ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడిపై బెంగాల్‌లో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైందని, 'సిందూర్ ఖేలా' శక్తి ఏమిటో ఈ రాష్ట్ర మహిళలకు బాగా తెలుసని పేర్కొన్నారు. దుర్గామాత పూజలో భాగంగా పశ్చిమబెంగాల్ మహిళలు సంప్రదాయబద్ధంగా 'సిందూర్ ఖేలా' నిర్వహిస్తారు. 'పహల్గాంలో మన సోదరీమణుల నుదుటి సిందూరాన్ని చెరిపివేసే దుస్సాహసానికి ముష్కరులు పాల్పడ్డారు. వారికి సిందూరం శక్తి ఏంటో మన సైన్యం రుచి చూపించింది. మనం వారి భూభాగంలోకి ప్రవేశించి మూడుసార్లు దాడులు చేశామని పాకిస్థాన్ గుర్తుంచుకోవాల'ంటూ... మెరుపు దాడులు (2016), బాలాకోట్ వైమానిక దాడులు(2019), ఇప్పటి ఆపరేషన్ సిందూర్‌ను మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదం, ప్రజల ప్రాణాలు తీయడంలో పాకిస్థాన్ ఆర్మీ బాగా ఆరితేరిందన్నారు.

**బెంగాల్‌లో 'నిర్మమ్' సర్కార్'**

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని ఉద్దేశించి ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రం వరుస సంక్షోభాలతో సతమతమవుతోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కొనసాగిన నిరసనల సమయంలో ముర్షిదాబాద్, మాల్దాలో చోటుచేసుకున్న ఘర్షణలు ఆమె ప్రభుత్వ క్రూరత్వం, ఉదాసీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'నిర్మమ్' (దయలేని) ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. 'రాష్ట్రంలో అధికార పార్టీ వ్యక్తులు కొందరి ఇళ్లను గుర్తించి తగులబెడుతుంటే పోలీసులు అడ్డుకోకుండా చూస్తూ ఉంటే.. అది ఎంతటి భయానక పరిస్థితో అర్థంచేసుకోండి. ప్రభుత్వాన్ని నడిపేది ఇలాగేనా? ఇక్కడి సర్కారుపై ప్రజలకు విశ్వాసం లేదు. దీనిని మార్చివేయాలని, సుపరిపాలన కావాలని కోరుకుంటున్నారు' అని మోదీ పేర్కొన్నారు.

**ఇదే సరైన సమాధానం**

భారత్‌లో ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసే వారికి సరైన సమాధానం ఆపరేషన్ సిందూర్ అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం ఏకమైందన్నారు. సిక్కిం రాష్ట్ర హోదా పొంది 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి వర్చువల్ విధానంలో ఆయన ప్రసంగించారు. ప్రతికూల వాతావరణం వల్ల గ్యాంగ్‌టక్‌కు రాలేకపోయినట్లు తెలిపారు.

## కాంట్రాక్టులపై సంతకాలు చేస్తారు.. డెలివరీలు జరగవు




**ఇంటర్నెట్‌డెస్క్:** రక్షణ రంగంలోని ప్రధాన కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి కానీ.. డెలివరీలు మాత్రం మొదలుకావని వాయుసేన అధిపతి ఎయిర్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐఐ వార్షిక సమావేశంలో ఆయన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలోనే ఈ వ్యాఖ్యలు చేశారు. "చాలా సార్లు కాంట్రాక్టులపై సంతకాలు జరుగుతాయి.. కానీ, సిస్టమ్స్ (ఆయుధాలు) మాత్రం ఎప్పటికీ అందవు. టైమ్‌లైన్ ప్రధాన సమస్య. సకాలంలో పూర్తయిన ఒక్క ప్రాజెక్టు కూడా నాకు గుర్తుకురావడంలేదు. మనం చేయలేని పనికి ఎందుకు వాగ్దానాలు చేయడం? తేజస్ ఎంకే1 చాలా ఆలస్యమైంది. ఇక తేజస్ ఎంకే2 ప్రొటోటైప్ కూడా అందుబాటులోకి రాలేదు. ఇక ఆమ్కా ఫైటర్‌కు సంబంధించి ఇప్పటి వరకు నమూనా విమానం కూడా రాలేదు. మన దళాలు.. పరిశ్రమ మధ్య విశ్వాసం పెరగాల్సిన అవసరం ఉంది. పారదర్శకత చాలా అవసరం. మనం ఒక్కసారి దేనికైనా కట్టుబడితే.. దానిని అందించి తీరాల్సిందే. మేకిన్ ఇండియా కోసం వాయుసేన శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. మనం ఈ రోజు సంసిద్ధంగా ఉంటేనే.. భవిష్యత్తుకు సన్నద్ధం కాగలము. రానున్న పదేళ్లలో.. మన పరిశ్రమలు ఉత్పత్తిని గణనీయంగా పెంచగలవు. కానీ, ప్రస్తుతానికి మనం త్వరగా చర్యలు తీసుకోవడం అవసరం. దళాలను శక్తిమంతం చేసుకొంటేనే యుద్ధాలు గెలుస్తాం" అని పేర్కొన్నారు.

**యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది!**

యుద్ధ రంగంలో వేగంగా మారిపోతున్న సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ సూచించారు. "మన నౌకాదళాధిపతి చెప్పినట్లు యుద్ధ రంగం వేగంగా మారిపోతోంది. ప్రతి రోజు సరికొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నట్లు చూస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌తో.. మనం ఎక్కడ ఉన్నాం.. భవిష్యత్తుకు ఏం కావాలనే దానిపై స్పష్టమైన అవగాహన వచ్చింది. మనం చేయాల్సింది చాలా ఉంది. ఆమ్కా ప్రాజెక్టును ప్రైవేటు సెక్టార్ కోసం కూడా క్లియర్ చేశారు. ఇది చాలా పెద్ద నిర్ణయం. మన ప్రైవేటు రంగంపై దేశానికి ఆ స్థాయిలో విశ్వాసం ఉంది. భవిష్యత్తులో భారీ మార్పులకు ఇది బాటలు పరుస్తుంది" అని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరిలో కూడా వాయుసేనాధిపతి తేజస్ డెలివరీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు."తయారీ సంస్థలు ఉత్పత్తి వేగం పెంచడానికి అత్యాధునిక వ్యవస్థలపై పెట్టుబడులు పెట్టాలి. వారి మానవ వనరుల నైపుణ్యాలకు మెరుగులు దిద్దాలి. తేజస్ తొలి ఎయిర్ క్రాఫ్ట్ 2001లోనే గాల్లోకి ఎగిరింది. 2016 నుంచి ఇప్పటి వరకు తొలి 40 విమానాల డెలివరీ కూడా పూర్తికాలేదు" అని నాడు ఆయన వ్యాఖ్యానించడం సంచలనం సృష్టించింది.

# దైవసమానులు గుండి రాజర్షి




ఆయన కర్మయోగి. అష్టాదశ పురాణాలను ఔపోసన పట్టి, వేద వేదాంగ సకల శాస్త్రాలపై సాధికారికత కలిగి ఎలాంటి పౌరాణిక సందేహాన్ని అయినా నివృత్తి చేయగలిగిన అపర వేదవ్యాసుడు ఆయన. నిరంతర తపోనిష్టతో, నిత్యభాగవత పారాయణము మందే మునిగి తేలి, సిద్దిపొందిన తాపసి ఆయన. దివంగత ప్రధాని పి.వి. నరసింహా రావు మొదలు గాగల అగ్ర నేతలు, కవిసామ్రాట్ విశ్వనాథ లాంటి సాంప్రదాయ కవులు, ప్రాచ్య పాశ్చాత్య విద్యావేత్తలు ఎందరి చేతనో పలుమార్లు దర్శింపబడి మహామహులచే పూజింప బడిన పరమ భాగవతోత్తముడు ఆయన. ఆయనే గుండి రాజర్షిగా పేరెన్నిక గన్న గుండి రాజన్న శాస్త్రి. ధర్మపురి క్షేత్ర గోదావరి తీరాన గుడి నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ జరిగి, నిత్య పూజలు అందుకుంటున్న దైవ సమానులు గుండి రాజర్షి. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యలకు నెలవై, హైందవ సనాతన సాంప్రదాయాలకు పట్టు కొమ్మయై, వేద సంస్కృతి సభ్యతలకు ఆలవాలమై, వరదాయినిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా తెలుగునేలపై వాసికెక్కిన, గోదావరి తీరస్త పవిత్ర తీర్ధ రాజం ధర్మపురి క్షేత్ర కీర్తి ప్రతిష్టలను, దశదిశలా వ్యాపింప జేశారు, ఆపర వేదవ్యాసులుగా కీర్తించబడే గుండి రాజర్షి... వ్యాస, వాల్మీక, కాళిదాస, కాణాద, పైల, జెమిని, పరాశర ఆపస్తంభ అది మునులు ఋషులు, యోగులు, కర్మిష్ఠులు, పరివ్రాజకుల, ఆధ్యాత్మికుల వార సత్వాన్ని కొనసాగిస్తూ, దేవతా పూజలతో, ఆధ్యాత్మిక ఆది భౌతిక కార్యక్రమాలను, అక్షయ నిధులైన పురాణ ప్రవచనాలను, క్షేత్ర రాజం పరిరక్షిస్తూనే ఉంది. ఆ సంప్రదాయ ఆచరణ క్రమంలో "అపర వేదవ్యాసులు" గా పేరెన్నికగన్న రాజన్న శాస్త్రి తన స్వగృహంలో ప్రవచనాలను నిర్వహించగా, దివంగత భారత ప్రధాని పీవీ నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఆచార్య దివాకర్ల వెంకటావధాని, తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ లాంటి మహామహులు ఎందరో, ప్రత్యేకించి ఈ క్షేత్రానికి వచ్చి, రాజన్న శాస్త్రి, భాగవత ప్రవచనాలను విని, ఆధ్యాత్మిక లోకాలలో విహరించి, ఆయనకు ప్రణమిల్లిన సంఘటనలు, క్షేత్ర వాసులకు చర్విత చర్వణలే. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణచే "మ్రోయు తుమ్మెద" లో వర్ణించ బడినట్లుగా, గుండి రాజన్న శాస్త్రి అష్టాదశ పురాణాలను, నిరంతరం అధ్యయనం చేస్తుండగా పాశ్చాత్య పండితులెందరో, పౌరాణిక సందేహ నివృత్తికై శాస్త్రి వద్దకు వెళ్లిన సంఘటనలు, క్షేత్రవాసులకు నిత్యజ్ఞాపకాలే. సాక్షాత్తు "వేదవ్యాస అవతారం"గా భావించబడే రాజన్న శాస్త్రి విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయం నిర్మించి, నిత్య పూజలు జరపడం విశేషం. ధర్మపురి క్షేత్రంలో గుండి లక్ష్మీ నరసింహ ఘనాపాఠి లక్ష్మీ నరసమ్మ దంపతులకు 1893 డిసెంబర్ 9న జన్మించిన శాస్త్రి, గుండి పాపయ్య కుటుంబానికి దత్తపుత్రులైనారు. బాల్యం నుండే ప్రహ్లాదాదుల వలె పరమాత్మ చింతనాపరులై, దివ్య ప్రబంధాదుల గానం చేస్తూ, ప్రాథమిక విద్య ఉర్దూ భాషలో జరిగినా, అష్ట వర్షములకే ఉపనయన సంస్కారులై, గాయత్రీ మంత్రోపాసకులై, వేదాధ్యయనాలు తండ్రి వద్ద చేసి, లీలావతి గణిత సాధన, మంథని చెందిన గట్టు కృష్ణశాస్త్రి వద్ద అమర భాష శాస్త్రాలను నేర్చుకున్నారు. అనంతరం వేద వేదాంగ, శాస్త్ర ఆగమ, ప్రస్థాన త్రయ, సాయణ భాష్య, శాంతి పాఠాలను రామాయణ, భారత, భాగవతాది పురాణాలు, ప్రధానంగా భాగవత బ్రహ్మసూత్రాలను కంఠోపాఠంగా చెప్పగలిగిన, అసాధారణ ధారణ శక్తి సంపన్నులైనారు. స్థానిక లక్ష్మీనరసింహ ఆలయంలో, కొంతకాలం నిరంతర భాగవత సప్తాహ యజ్ఞాలను నిర్వహించారు. ఉష: కాల మందే లేచి, నిత్య గోదావరి స్నానం, సంధ్యావందనం, ధ్యాన, ధారణ, పూజ, ఉపాసన, పారాయణ ఆది సత్కార్యా చరణలు నిత్య కృత్యాలుగా కలిగి ఉండేవారు. సమకాలీన సలక్షణ వేద ఘనాపాటిల సన్నిధిలో, వేదార్థ, ఉపనిషత్, భాష్య ప్రవచనం గావించేవారు. భక్త బృందం సమేతంగా, రాత్రి సత్సంగ, భక్తి మయ జాగరణలు, సంగీత సభలు, సాహితీ గోష్టులు, భజనలతో గడిపేవారు. ప్రధానంగా ధర్మపురి దేవస్థానంలో, వైకుంఠ ఏకాదశి, నరసింహ నవరాత్రులు, శివరాత్రులు, ఉగాది, ఆదిగా పర్వదిన వేడుకలను ప్రారంభించి ఆచరింప చేశారు. పిత్ర స్వార్జితములను, దానధర్మాలకు సన్మానాలకు ధారపోసి, దాన గుణం సంపన్నులైనారు. బాలబాలికలచే, సంస్కృతం మాట్లాడింప చేస్తూ బాలురను శృతి, స్మృతి, పురాణ, కావ్య భక్తిరస ప్రధాన శ్లోకాలు, పద్యాలను కంఠస్తం చేయించేవారు. 1966 విజయదశమి నాడు క్షేత్ర రామలింగేశ్వరాలయంలో, సంస్కృతాంధ్ర డిగ్రీ ప్రాచ్య కళాశాల ప్రారంభించి, ప్రాణప్రతిష్ట గావించారు. నాటికీ, నేటికీ ఈ కళాశాల వేలాది మంది భాషా పండితుల తయారీ కేంద్రంగా భాసిల్లుతుండడానికి కారణ భూతు లైనారు. దేశ విదేశీయులు, శాస్త్రి దర్శనం చేసుకొని, పలు సందేహాలు నివృత్తి చేసుకునేవారు. శ్రీ శ్రీ శ్రీ శృంగేరి, కంచి కామకోటి, పుష్పగిరి, హంపి, పీఠాధిపతులు, శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ పెద్ద జీయర్ స్వామి, తదితర జగద్గురు వులు క్షేత్రానికి విచ్చేసిన అన్ని సందర్భాలలోనూ, వారి సన్నిధిన అష్టాదశ పురాణ సందర్భాలను ప్రవచించి, వారిచే సన్మానితులు అయినారు. పి.వి. నరసింహా రావు, బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య తెన్నేటి విశ్వనాథం, విశ్వనాథ సత్యనారాయణ, దివాకర్ల వెంకటావధాని, బిరుదు రామరాజు, మార్కండేయ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, మల్లాది చంద్రశేఖర శాస్త్రి తదితరులు, పలుమార్లు రాజర్షి వద్దకు ఏతెంచి పునీతుల మైనా మని భావించి, అపర వేదవ్యాసులుగా కీర్తించిన సందర్భాలు అనేకానేకాలు. 84 సంవత్సరాలు జీవించి, ధర్మపురి వాసులను సన్మార్గమున నడిపి, 1975 మే 30న జీవన్ముక్తులై శివైక్యం పొందారు. శాస్త్రి మనమడు గుండి విష్ణు ప్రసాద్ చొరవతో, ఆయన సతీమణి ప్రొఫెసర్ వారిజా రాణి సంపాదకత్వంలో, లబ్ద ప్రతిష్టులైన వారి ప్రత్యేక వ్యాసాలతో అపూర్వ, అపురూప, అమూల్య పుస్తకం అచ్చు వేసి, రాజర్షి గురించి పలు అంశాలు పొందు పరచ గలిగారు. "భగవత్ సాన్నిహిత్య సాధనకు సాధువులే కానక్కరలేదని, కౌటింబిక జీవన విధానంలోనూ, భగవానుని భక్తితో కొలిస్తే, ముక్తి లభించగలదని", కొత్త సంప్రదాయానికి పురుడు పోసి, నిత్య నిరంతర పురాణ ప్రవచనాలు నిత్యానందంగా భావించి, సిద్ది పొందిన తాపసి రాజ రుషికి గోదావరి తీరాన, రామమందిర సమీపాన, స్థిర విగ్రహ ప్రతిష్ట గావించి, గుడి కట్టి నిత్య పూజలు నిర్వహించడం, ధర్మపురి వాసులు చేసుకున్న పురాకృత సుకృతం.

# తెలుగు సాహిత్యానికి తత్వశిఖరం



తెలుగు సాహిత్యాన్ని తన అద్భుత కవిత్వంతో, లోతైన విమర్శలతో, విశ్లేషణాత్మక వ్యాసాలతో కొత్త దిశల్లో నడిపించిన మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మ. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాకుండా, సమాజంలో చైతన్యాన్ని రేపే ఒక విప్లవాత్మక శక్తి. ఆధునిక తెలుగు కవిత్వానికి ఊతమిచ్చిన మహోన్నత వ్యక్తిత్వం. శేషేంద్ర సాహిత్య ప్రపంచం వర్ణనాత్మకత, తత్త్వచింతన, సామాజిక చింతన, భాషా వైవిధ్యం, అంతర్జాతీయ దృక్పథం లతో విస్తరించి ఉంది.శేషేంద్ర శర్మ జననం 1927 అక్టోబర్ 20న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నాగరాజుపాడు గ్రామంలో జరిగింది. ఆయన తండ్రి సంస్కృత సాహిత్యంలో ప్రావీణ్యం కలిగిన పూజారి గుంటూరు సుబ్రహ్మణ్య శర్మ. చిన్ననాటి నుంచే శేషేంద్రకు వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం మీద మక్కువ పెరిగింది. విద్యాభ్యాసం తొటపల్లి గూడూరు పాఠశాలలో ప్రారంభమై ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రుడిగా, మద్రాసు లా కాలేజీ నుండి న్యాయ శాస్త్రంలో డిగ్రీతో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం చేసినప్పటికీ, సాహిత్యపట్ల ఆయన ఆసక్తి ఎప్పటికీ తగ్గలేదు. శేషేంద్ర శర్మ సాహితీ ప్రస్థానం అసాధారణం. ఆయన కవిత్వంలో ఉన్న అద్భుత ఊహాశక్తి, సామాజిక చింతన, తత్త్వ విచారణ, వ్యక్తిత్వ విశ్లేషణ తెలుగు కవిత్వాన్ని కొత్త శిఖరాలకు చేర్చింది. కేవలం రూపకాలు, అలంకారాలతోనే కాదు, కవిత్వంలో లోతైన భావాలను మేళవించి సమాజాన్ని ఆలోచింపజేసే విధంగా రచనలు చేశారు. తన కవిత్వంలో తర్కం, ఆచారవిచారం, చరిత్ర బోధ, తత్త్వచింతన మేళవించి ఒక ప్రత్యేక శైలిని రూపొందించారు. "నా దేశం – నా ప్రజలు" అనే కావ్యం శేషేంద్రగారిని దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తెచ్చింది. ఇందులో సామాజిక అసమానతలు, దేశభక్తి, మానవీయత వంటి అంశాలను రసప్రధంగా, ఆవేశ పూరితంగా వ్యక్తీకరించారు. "మంథర", "షోడశి – రామాయణ రహస్యాలు", "ఆధునిక మహాభారతం", "స్వర్ణహంస", "సముద్రపు రెక్కలు", "నెమలికన్ను" వంటి రచనలు శేషేంద్రను ఆధునిక తెలుగు సాహిత్యంలో దృఢంగా నిలిపాయి. "మంథర"లో భారతీయ తత్త్వశాస్త్రం పట్ల ఆయన అవగాహన, అంతరంగా పొందిన అనుభూతులు ప్రతిఫలిస్తాయి. "షోడశి"లో రామాయణంలోని రహస్యాలను లోతుగా పరిశీలిస్తూ శ్రీవరాలను సరికొత్త దృక్పథంలో ఆవిష్కరించారు. శేషేంద్ర వచన కవిత్వం కేవలం వర్ణనాత్మకతకు పరిమితం కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ సాహిత్య ధోరణులను అద్భుతంగా మిళితం చేసింది. అందులో భాషా వైవిధ్యం, సంస్కృత పదసముపేతం, ప్రతీకలు, చిహ్నాల విశేష ప్రయోగం, శబ్ద సౌందర్యం సమ్మేళనం సాహితీ పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుంది. కవిత్వం అంటే కేవలం భావాలను వ్యక్తీకరించడం మాత్రమే కాదు, అది ఒక చైతన్య ప్రవాహం అని ఆయన నిరూపించారు.శేషేంద్ర కవిత్వం మనసుకు హత్తుకునే రూపంలో, ఒక వేళ వినిపిస్తే సంగీతంలా, చదివితే తత్త్వ రససుధగా అనిపిస్తుంది. "సముద్రం నా పేరు", "గొరిల్లా", "మండే సూర్యుడు", "కవిసేన మేనిఫెస్టో", "రక్తరేఖ", "కాలరేఖ", "జనవంశమ్" వంటి రచనలు కాలంతో పోరాడే కవిత్వానికి, సమాజాన్ని చైతన్యపరిచే సాహిత్యానికి ప్రతీకలు. శేషేంద్రకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (1994లో "నా దేశం – నా ప్రజలు"కు), తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, కలకత్తా రాష్ట్రీయ హిందీ అకాడమీ అవార్డు, విశ్వకవి పురస్కారం లాంటి అనేక ప్రతిష్టాత్మక బహుమతులు లభించాయి. కవిసేనాని, కవి చక్రవర్తి, రాష్ట్రేంద్రులాంటి బిరుదులు ఆయన సాహిత్య ప్రస్థానానికి గౌరవ తీర్థాలు.శేషేంద్ర శర్మ కేవలం కవి కాదు – తత్త్వవేత్త, చింతకుడు, సమాజానికి మార్గదర్శకుడు. ఆయన రచనలు తెలుగులోనే కాదు, అనేక భాషల్లోకి అనువదించబడి విశ్వ సాహిత్యంలోనూ తనదైన స్థానం సంపాదించు కున్నాయి. 2007 మే 30న ఆయన భౌతికంగా మన మధ్యనుండి వెళ్లిపోయినా, ఆయన సాహిత్యమూర్తి తెలుగువారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది. తెలుగు సాహిత్య చరిత్రలో శేషేంద్ర శర్మ ఒక మహానామం. ఆయన కవిత్వం, విమర్శ, తత్త్వచింతనలు ఈ తరానికి మాత్రమేకాదు, రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలవనున్నాయి.

# భారతీయ జర్నలిజం ఆద్యుడు

రెండు దశాబ్దాలకు పూర్వం ఆంగ్లం, పార్సియన్ లాంటి భాషల్లో మాత్రమే పాఠకులకు పత్రికలు అందుబాటులో ఉండేవి. హిందీ భాష అత్యధికంగా మాట్లాడే భారతంలో నాడు హిందీలో పత్రికలు ఉండేవి కాదు. ఈ లోటును గ్రహించిన కాన్పూర్‌కకు చెందిన పండిట్ జుగల్ కిషోర్ శుక్లా 30 మే 1826 రోజున కొల్‌కతాలో తొలిసారిగా "ఉదంత్ మార్తాండ్ (ఉద్యమించే సూర్యుడు)" అనే వార పత్రికను అందుబాటులోకి తేవడంతో భారతీయ భాషల్లో పత్రికల విప్లవం ప్రారంభమైంది. ఈ మహత్తర సంఘటనకు గుర్తుగా ప్రతి ఏట 30 మే రోజున "హిందీ జర్నలిజం దినోత్సవం (హిందీ జర్నలిజమ్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ఈ వేదిక ఆధారంగా హిందీ జర్నలిస్టులు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్లు, కరస్పాండెంట్లు లాంటి వర్గాల త్యాగాలు, అంకితభావాలను గుర్తు చేసుకోవడంతో పాటు విధి నిర్వహణలో ప్రాణాలు సహితం కోల్పోయిన వారికి నివాళులు అర్పించడం జరుగుతుంది. నాడు హిందీ పాఠకులు తక్కువగా ఉండడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల కారణంగా కేవలం 79 వారాలు మాత్రమే పత్రికలను విడుదల చేసి ఆ తర్వాత ఆపి వేయడం జరిగింది. అయినప్పటికీ నాడు జుగల్ కిషోర్ శుక్లా నాటిన చిన్న హిందీ పత్రిక బీజం కాలక్రమంలో విస్తరించి నేడు పాఠకులకు అనేక రకాలైన పత్రికలు, ఆన్‌లైన్ పత్రికలు, టివీ చానెల్స్ లాంటివి అందుబాటులోకి రావడం జరిగింది. పత్రిక అంటే సమాచార వితరణ మాత్రమే కాదని, ఇవి ప్రజలను ఏకం చేసే శక్తివంతమైన మాధ్యమాలని, సమస్యలను పరిష్కరించే వేదికలని తెలుసుకోవాలి. నేటి పత్రికలు మానవ హక్కులు, సజావుగా ఎన్నికల నిర్వహణ, విద్య, సమకాలీన అంశాలు, రాజకీయం, సామాజిక సమస్యలను బహిరంగ పరిచే వేదికలుగా అమూల్య సేవలను అందిస్తున్నాయి. 1826లో ప్రారంభమైన తొలి హిందీ పత్రిక తర్వాత దినదినం అభివృద్ధి చెందుతూ నేడు వందల, వేల పత్రికలు అందుబాటులోకి వచ్చాయి దైనిక్ జగరన్, అమర్ ఉజాల, హిందూస్థాన్, రాజస్థాన్ పత్రిక లాంటివి అనేకం పాఠకులకు సమాచార, విద్య, విజ్ఞాన, సామాజిక చైతన్య విందులను వడ్డిస్తున్నాయి. 1990ల్లో హిందీ టివీ చానెల్స్ అందుబాటులోకి రావడం, తర్వాత యూట్యూబ్ చానెల్స్, మొబైల్ ఆప్‌లు లాంటి రావడంతో నేడు అరచేతిలో అన్ని పత్రికలు ఇమిడిపోయాయి. హిందీ జర్నలిజం దినం వేదికగా యూనివర్సిటీలు, పత్రికా సంస్థలు, ప్రెస్ క్లబ్‌లు, పాఠక సంఘాలు పలు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలి. డిజిటల్ ఏఐ టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ నేడు పత్రికల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతూ పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి.

## వినాయక్ దామోదర్ సావర్కర్ ఆదర్శనీయుడు

**ఆర్ ఎస్ఎస్ నాయకులు**



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** హిందూత్వ వాదాన్ని నరనరాన జీర్ణించుకున్న వినాయక్ దామోదర్ సావర్కర్ నేటి యువతకు ఆదర్శనీయుడని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం నాయకులు అన్నారు. బుధవారం రాత్రి ఆయన జయంతిని పురస్కరించుకొని మణికొండ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం వారు మర్రిచెట్టు కూడలి వద్ద అంజలి ఘటించి, దేశభక్తి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని సమర్పిస్తానని ప్రతిన భూనిన యోధుడని కొనియాడారు. 1857 లోని స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రను మరుగునపడకుండా తన రచనల ద్వారా ప్రజలను ఉత్తేజపరచిన చరిత్రకారుడని గుర్తు చేశారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

## శ్రీరామ్ నగర్‌లో మంచినీటి సరఫరాపై పరిశీలన

## బిఆర్ఎస్ నాయకులు కొంపల్లి జగదీష్ నేత



**గండిపేట్ : సూర్య ప్రతినిధి** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో గురువారం జలమండలి లైన్‌మెన్ రాజు, బీఆర్ఎస్ డివిజన్ సీనియర్ నాయకుడు కొంపల్లి జగదీష్ నేత ఇంటింటికీ వెళ్లి మంచినీటి సరఫరాను పరిశీలించారు. స్థానికులు మంచినీరు కలుషితంగా వస్తోందని ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కొంపల్లి జగదీష్ మాట్లాడుతూ...నీటి నమూనాలను సేకరించి పరీక్షించామని తెలిపారు. స్థానికుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన జలమండలి, బీఆర్ఎస్ నాయకులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## మునుగోడు ప్రాంతం పోరాటాలకు పురిటిగడ్డ

ప్రజలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి
నల్లగొండ జిల్లా భారతదేశంలో ప్రసిద్ధి గాంచింది
సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి
ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





**మునుగోడు, సూర్య ప్రతినిధి** మునుగోడు మండల పరిధిలోని సింగారం గ్రామంలో సిపిఐ 15వ మండల మహాసభ మండల కార్యవర్గ సభ్యులు, సింగారం గ్రామ మాజి సర్పంచ్ ఉప్పునూతల రమేష్ అధ్యక్షతన జరిగినది..గ్రామంలో ఎర్రజెండా తోరణాలు, జెండాలతో రెపరెపలాడాయి.ప్రజా నాట్యమండలి కళాకారులు సభ ప్రాంగణంలో ఆటా పాటలతో ఉర్రూతలూగించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు,మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి,సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ,ఎమ్మెల్సీ నెల్లికంటీ సత్యం,లు పాల్గొని అమరవీరులకు నివాళులర్పించి ,జెండాను ఆవిష్కరించారు..పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. సిపిఐ 100 సంవత్సరాల కాలంలో నల్లగొండ జిల్లాలో రావి నారాయణరెడ్డి సాకలి ఐలమ్మ అనేకమంది అసమాన త్యాగాలు చేశారన్నారు.. నల్లగొండ జిల్లా అనగానే ఎర్ర జెండా కేంద్రంగా నల్లగొండ జిల్లా ప్రసిద్ధి గాంచింది అన్నారు..స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించాలని అన్నారు..ఎమ్మెల్సీ నెల్లికంటీ సత్యం మాట్లాడుతూ అసమాన త్యాగాలతో ముందుకు ఏళ్తున్న పార్టీ సీపీఐ అన్నారు..దేశంలో మొత్తం రైతన్నలకు ,ప్రజలకు నాయకత్వం వహిస్తున్నాం,లక్షలాది మంది కార్యకర్తలు వున్న పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు..పార్టీ ఆశయ సాధనకోసం ముందుకు పోదాం అన్నారు.కేంద్రం ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయనీ..బీజేపీ ప్రభుత్వం కేవలం రైతులకు వ్యతిరేకం,బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాత దళితుల మీద,జర్నలిస్టుల మీద ,ప్రజల మీద దాడులు చేస్తున్నాయనీ మండిపడ్డారు. మత విద్వేషాలతో రెచ్చగొడుతున్నాయి.ప్రజలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు...ప్రతి తెలంగాణ ఉద్యమములో కమ్యూనిస్టులు పోరాటం చేయడం జరిగింది అని గుర్తుకు తెచ్చారు.మునుగోడు మండలములో ఏపార్టీ కి లేనటువంటి చరిత్ర మన పార్టీకి ఉందనీ,బలమయిన శక్తి ఉందన్నారు..కమ్యూనిస్టులు గెలిస్తే ప్రజల పక్షాన నిలబడతారూ,గెలిపించుకోవడం కోసం కృషి చేయాలన్నారు..ఈ కార్యక్రమములో,ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కురుమిద్ది శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, బోలుగూరి నరసింహ, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, గాలయ్యనాయకులు తీర్పాటి వెంకటేశ్వర్లు,గోస్కొండ లింగయ్య, దుబ్బ వెంకన్న, ఎండి జానీ ఈదులకంటి కైలాస్, బెల్లం శివయ్య,బండారి శంకర్,ప్రజానాట్యమండలి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలి

**మద్దూర్, మే 29:-** నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే రైతులకు విక్రయించాలని నకిలీలు అంటగడితే కేసులు నమోదు చేస్తామని మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ అన్నారు. మద్దూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులతో మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్ వ్యవసాయ అధికారి రామకృష్ణ లు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రైతులకు నకిలీ విత్తనాలు నాసిరకం ఎరువులు అమ్మ రాదని తెలిపారు. ఒకవేళ నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం సంయుక్తంగా విత్తనాలు %ఆ% ఎరువుల దుకాణాలలో అకస్మిక తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో ఉన్న విత్తనాల స్టాక్ వివరాలను, ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. అదేవిధంగా విత్తనాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలు, డెలివరి చలాన్‌లను, మార్కెటింగ్ అగ్రిమెంట్, వచ్చిన స్టాక్, విత్తనాల విక్రయ రిజిస్టర్, లాట్ రిజిస్టర్, రైతు విక్రయ రిజిస్టర్, లైసెన్స్ సక్రమంగా వున్నాయ లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పకడ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసి రకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది



లేదన్నారు. రైతులు సైతం విత్తనాలు కొనుగోలు సమయంలో అప్రమత్తత పాటిస్తూ ..కొనుగోలు రశీదు తీసుకోవాలని సూచించారు. డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు రైతులకు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయిచవద్దని, రైతులకు నష్టం కలిగేలా వ్యవహారింవద్దని అన్నారు. మార్కెట్ లో నకిలీ విత్తనాల విక్రయం జరుగకుండా టాస్క్ ఫోర్స్ బృందాల నిరంతరం పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. కొంతమంది దళారులు ముఠాలుగా ఏర్పడి, తక్కువ డబ్బుకు విత్తనాలు ఇస్తామని ఆశ చూపి రైతులను మోసం చేస్తారని, ఇటువంటి వారిపై గ్రామాల్లో సైతం నిఘా పెట్టామని తెలిపారు. నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారికి గాని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.

# సాగులో కృత్రిమ మేధస్సు రైతుకు సహాయపడేనా?

## విజ్ఞానం విత్తనంగా మారిన కాలంలో రైతు విజేతగా నిలవగలడా?
## వ్యవసాయంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రైతుకు నూతన దిక్సూచి

అనంతపూర్, మే 29( సూర్య ప్రతినిధి)

మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం మూల స్తంభం. ఇది కోట్లాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా మారింది. అయినప్పటికీ, వ్యవసాయం ఇప్పటికీ ఆశలతో నిండిన జూదంలా మిగిలిపోయింది. అతివృష్టి, అనావృష్టి ,మారిన వాతావరణ పరిస్థితులు, ధరల అస్థిరత, నాణ్యమైన విత్తనాలు లేకపోవడం, మార్కెట్ సమాచారం కొరత వంటి అనేక సమస్యలు రైతు భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ %-% ఏ ఐ) రూపంలో కొత్త ఆశాకిరణం వ్యవసాయ రంగంలో కనిపిస్తోంది. ఇది రైతుకు , అనుభవ జ్ఞానం, ఆధునిక విజ్ఞానం సమన్వయంతో ముందడుగు వేయడానికి దోహదపడుతోంది.




**ఎందుకు అవసరం కృత్రిమ మేధస్సు వ్యవసాయానికి ?**

ఈ రోజుల్లో రైతు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:
వాతావరణ మార్పుల వల్ల పంట నష్టాలు
అధిక పెట్టుబడి ఖర్చులు
అనిశ్చితమైన మార్కెట్ పరిస్థితులు
పంటలపై ముందస్తు సమాచారం, సలహాల లేమి వంటి ప్రధాన సమస్యలు రైతులు సాగులో ఎదుర్కొంటున్నారు
ఈ సవాళ్లను ఎదుర్కొనే ప్రయత్నంలో సాంకేతికత. కృత్రిమ మేధస్సు రైతుకు ఎంతో దోహదపడుతాయి
భవిష్యత్తు వాతావరణ అంచనాలు
మట్టిలో పోషకాల విశ్లేషణ
తెగుళ్లు, వ్యాధుల గుర్తింపు
పంటల ఆరోగ్యం పర్యవేక్షణ
నీటి యాజమాన్యం
మార్కెట్ ధరల విశ్లేషణ
ఇవన్నీ కచ్చితత్వంతో రైతుకు ముందస్తుగానే సులభంగా, చేరవేసే పరిస్థితిని ఏ ఐ కల్పిస్తుంది
ఏ ఐ వ్యవసాయానికి తోడ్పడుతున్న ముఖ్య రంగాలు

**వాతావరణ విశ్లేషణ**

ఏ ఇ ఆధారిత పరికరాలు వర్షపాతం, ఉష్ణోగ్రత, వాతావరణంలోని తేమ, లాంటి ఎన్నో అంశాలను శాస్త్రీయంగా అంచనా వేస్తాయి. దీని ద్వారా:
సాగు కాలాన్ని నిర్ణయించటం
నీటి నిర్వహణలో ముందస్తు చర్యలు
విపత్కర వాతావరణానికి ముందుగానే తగిన ఏర్పాట్లు

**మట్టి విశ్లేషణ**

స్మార్ట్ సెన్సార్లు, ఏ ఐ పద్ధతుల ద్వారా మట్టిలో పోషకాల స్థాయిని గుర్తించి, దానికి అనుగుణంగా పంట ఎంపిక చేయడం ద్వారా దిగుబడిని పెంచుకోవచ్చు, పెట్టుబడులు తగ్గించుకోవచ్చు
పురుగులు, తెగుళ్ల గుర్తింపు
ఏ ఐ ఆధారిత మొబైల్ యాప్‌లు (ఉదా: ప్లాంటెక్స్) మొక్కల ఫోటోను విశ్లేషించి తెగుళ్లు, వ్యాధులపై తక్షణ సమాచారాన్ని అందిస్తాయి, తద్వారా త్వరితగతిన నివారణ చర్యలు చేపట్టవచ్చు

**పంటల ఆరోగ్యం విశ్లేషణ**

డ్రోన్ల ద్వారా తీసిన చిత్రాలను ఏ ఐ విశ్లేషించి మొక్కల నీటి అవసరం, పోషక లోపాలు గుర్తించి, సరైన పరిష్కారాలు అందిస్తుంది.

**మార్కెట్ ధరల అంచనాలు**

గతపు ధరల డేటా ఆధారంగా ఏ ఐ భవిష్యత్తులో వచ్చే ధరలపై అంచనాలను చూపిస్తుంది. ఇది రైతుకు ముందస్తుగా మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందించడంలో తోడ్పడుతుంది. అలాగే ఏ పంట వేస్తే మంచి ధరలు పొందవచ్చో ముందుగానే తెలుసుకోవచ్చు
భారతదేశంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఏ ఐ సేవలు క్రాపిన్, ఫసల్, దేహత్, అగ్రి నెక్ట్స్ లాంటి కొన్ని దేశీయ సంస్థలు ఏ ఐ ఆధారిత వ్యవసాయ సేవలును ఇప్పటికే రైతులకు అందిస్తున్నాయి.
ఇస్రో ఉపగ్రహ దృశ్యాల ఆధారంగా పంటల పర్యవేక్షణ
గూగుల్ ఎర్త్ ఇంజన్, ఐ బి యం వాట్సన్ లాంటి అంతర్జాతీయ టెక్నాలజీలు వ్యవసాయ రంగంలో వినియోగంలో ఉన్నాయి.
బెంగళూరులోని సంస్థ అభివృద్ధి చేసిన 'కిసాన్ జిపిటీ' దేశీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర పథకాలపై పూర్తి సమాచారం అందిస్తోంది.
ఏ ఐ వల్ల రైతుకు కొన్ని లాభాల :
దిగుబడుల పెరుగుదల %-% సరైన సమాచారం ద్వారా ముందస్తు జాగ్రత్తలతో సాగులో అధిక దిగుబడులు పొందవచ్చు
రసాయన వినియోగం తగ్గింపు %-% అవసరమైన సమయంలో అవసరమైన చోట మాత్రమే అగ్రి ఇన్పుట్స్ ఉపయోగించడం వలన పెట్టుబడి తగ్గించుకోవచ్చు పంట నష్ట నివారణ %-% వాతావరణ హెచ్చరికలతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ముందుగానే పంట నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చు
ఆర్థిక భద్రత %-% మార్కెట్ ధరల అవగాహన
పరిసరాల రక్షణ %-% మట్టి, నీరు, జీవ వైవిధ్యం పరిరక్షణ చేపట్టవచ్చు
కొత్త వంగడాల సృష్టిలో ఏ ఐ పాత్ర
వాతావరణ మార్పుల నేపథ్యంలో కరువు, వరదలు పెరుగుతున్నాయి. వీటిని తట్టుకోగల బలమైన వంగడాల అవసరం పెరిగింది. జనరేటివ్ ఏ ఐ సాయంతో:
కొత్త వంగడాల డిజైన్ వేగంగా చేయడం
అధిక దిగుబడులు, వ్యాధుల నిరోధకత కలిగిన రకాలను అభివృద్ధి చేయడం
జన్యు సమాచారం ఆధారంగా తగిన మార్పులు సూచించడం జరుగుతుంది
ముందున్న సవాళ్లు
గ్రామీణ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం లోపం
ఏ ఐ సేవల ఖర్చు ఎక్కువగా ఉండడం
గ్రామాల్లో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ లాంటి మౌలిక వసతుల కొరత
స్థానిక భాషల్లో ఏ ఐ సేవలు అందుబాటులో లేకపోవడం
కృత్రిమ మేధస్సు(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)అనేది కేవలం సాంకేతిక సాధనం మాత్రమే కాదు , రైతు కష్టానికి విలువను చేకూర్చే మార్గం. ఇది మట్టిని చూడగలిగే మెదడు, పంటను అంచనా వేయగలిగే దృష్టి మార్గం . కృత్రిమ మేధస్సు అనేది రైతుకు ప్రత్యామ్నాయం కాదు అది కేవలం రైతు కష్టాన్ని సులభతరం చేయడానికి తోడుగా నిలిచే ఒక సాధనం .ఏ ఐ ని భవిష్యత్తు ధాన్యాగారంగా భావించి రైతుకు చెరువులో ఉంచాలి అప్పుడే రైతు ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి చేరుకోగలడు..
రైతు ఆర్థికాభివృద్ధే దేశాభివృద్ధికి ఆరంభం



జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

## గ్రామ బాటలో బీసీ చైతన్య పరంపర వర్ధన్నపేటలో మాస్ కార్యక్రమం






**సూర్య ప్రతినిధి, వర్ధన్నపేట :** హనుమకొండ జిల్లా వర్ధన్నపేటలో బీసీ చైతన్య కోసం "గ్రామ బాట" కార్యక్రమాన్ని మన ఆలోచన సాధన సమితి (మాస్) వ్యవస్థాపకులు కటకం నర్సింగ్ రావు ఆధ్వర్యంలో గురువారం పర్యటన జరగింది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే పన్నాల శ్రీరాములు గారితో పాటు, బీసీ ఉద్యమకారులు పసుల రవి, స్నేహలత, రమాదేవి, శ్రీదేవి, రజినీకాంత్ యాదవ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు. బీసీ మేధావులు, విద్యావేత్తలతో ముఖాముఖి చర్చలు నిర్వహించగా, ఇందులో దొంత ఆనందం, ఆవుల వెంకట్ యాదవ్, పెద్దవురా బ్రహ్మయ్య రజక వంటి ప్రముఖులు కూడా పాల్గొన్నారు. బీసీల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం వంటి అంశాలపై చర్చలు జరగడం గమనార్హం.

## రాములు నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి




మద్దూర్ మే 29: -నారాయణపేట జిల్లా మద్దూరు మండలం దేన్యానాయక్ తాండ కు చెందిన రాములు నాయక్ ఉపాధ్యాయుడు కోస్గి ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ యూ టీ ఎఫ్ కోస్గి మండల అధ్యక్షులుగా ఉంటూ అనారోగ్యంకు గురై మరణించిన విషయం తెలుసుకొని దేన్యానాయక్ తాండలో గల వారి నివాసం కు యూ టీ ఎఫ్ జిల్లా నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని గురువారం రోజు పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ రాములునాయక్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుండి రావాల్సిన బెనిఫిట్స్ వారి పిల్లల చదువులు తదితర విషయాల్లో మన ఉపాధ్యాయ సంఘం మీకు అండగా ఉంటుందని అన్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఈ ప్రాంత ఉపాధ్యాయ ఉద్యమ అభివృద్ధికి ఎంతో తోడుపాటుగా ఉన్నా రాములు నాయక్ మరణం వారి కుటుంబానికే కాకా ఈ ప్రాంత ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. పరామర్శించిన వారిలో యూ టీ ఎఫ్ జిల్లా నాయకులు శివరాములు, శంకర్ నాయక్, శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు అంజిలయ్య గౌడ్, అశోక్, హన్మంతు,వెంకటప్ప రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మద్దూర్ కు తిరుపతిరెడ్డి రాక

**మద్దూర్ మే 29:** నారాయణపేట జిల్లా మద్దూర్, కొత్తపల్లి, గుండు మాల్, కోస్గి మండలాలలో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వస్తున్నట్లు మద్దూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసింహ, తిరుపతి రెడ్డి పిఏ సైదులు ఒక ప్రకటనలో తెలిపారు.. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు విచ్చేసి జయప్రదం చేయగలరని వారు కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పైలట్ గ్రామాలలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాలి అకస్మిక తనిఖీ



**సూర్య ప్రతినిధి మర్రిగూడ :** మర్రిగూడ మండలంలో కొట్టాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పైలట్ గ్రామాలలో నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాలి అకస్మిక తనిఖీ... జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మర్రిగూడ మండలంలో కొట్టాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణాన్ని పరిశీలించారు మండలంలోని పైలట్ గ్రామాలైన కొట్టాల గ్రామంలో 54 ఇండ్లు మంజూరు చేయడం జరిగింది ఇందుకుగాను 11 ఇండ్ల నిర్మాణానికి బేస్మెంట్ పూర్తి అయినటువంటి ఇండ్లకు బిల్లులు మంజూరు చేయడం జరిగింది అని పురోగతి పరిశీలించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని వర్షాకాలం ప్రారంభం అయ్యేలోపు లబ్ధిదారులు గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రమణారెడ్డి మరియు తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో మునయ్య ఏపీఓ రవికుమార్ ఆ రైలు గ్రామ సెక్రెటరీ మాజీ జెడ్పిటిసి మేదిత యాదయ్య మరియు శ్రీశైలం గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## మద్దూర్ మున్సిపాలిటీలోకి మరో నాలుగు గ్రామాలు



**మద్దూర్ ,మే 29:** నారాయణపేట జిల్లా నూతనంగా ఏర్పడిన మద్దూర్ మున్సిపాలిటీ లోకి మరో నాలుగు గ్రామాలను కలుపుకోవడం జరిగిందని మద్దూర్ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీంపూర్, నాగంపల్లి, చాపన్ చెరువు తండా, ఎర్రగుంట తండా ఈ గ్రామాలను కలుపుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.

## మర్రిగూడ మండలంలో భవిత సెంటర్ జిల్లా కలెక్టర్ తనిఖీ



**సూర్య ప్రతినిధి మర్రిగూడ :** మర్రిగూడ మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్ క్లాస్ రూమ్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు స్కూలు ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేతకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తాసిల్దారు గారికి ఆమె సూచించారు ఆమె వెంట తాసిల్దార్ శ్రీనివాస్ ఎంపీడీవో మునయ్య తదితరులు పాల్గొన్నారు

## అనర్హులకేనా ఇందిరమ్మ ఇండ్లు?

### -కాంగ్రెస్ నాయకులు చెప్పిన వాళ్ళకేనా ఇండ్లు




**ఖమ్మం (సూర్య ప్రతినిధి) :** నిజమైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇండ్లు దక్కాలని ఓవైపు సిఎం మంత్రులు చెబుతున్న ఖమ్మం జిల్లా లో చాలా గ్రామాలలో మండలాలలో మాత్రం అర్హత లేకున్నా అధికార పార్టీ నాయకుల ప్రొద్భాలంతో అనర్హులని ఎంపిక చేస్తున్నారు. పొలాలు ఉన్నవారికి భూములు ఉన్నవారికి మూడు నాలుగు చక్రాల వాహనాలు ఉన్న వారికి సైతం ఇందిరమ్మ ఇండ్లు కేటాయించారు. ఈ మధ్యకాలంలో ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పెద్దపేట వేస్తున్నారు. దీంతో అర్హత ఉన్న లబ్ధిదారులు మాత్రం అధికారుల తీరపై నాయకులు తీరుపై మండిపడుతున్నారు. నేలకొండపల్లి మండలంలో ఓ గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి 70 శాతం ఇండ్లు కేటాయించారు. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్టు అనరులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికార పార్టీ నాయకుల ముత్తు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. వారిపై చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసిన కొరిపల్లి శ్రీను



**ఖమ్మం(సూర్య ప్రతినిధి)** పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో లైన్స్ క్లబ్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే తో స్వాగతం పలికిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ఎస్సీ దళిత వాడలను గ్రామ పంచాయితీలుగా ఏర్పాటు చేయ్యాలని మెమోరాండం ఇచ్చి విజ్ఞప్తి చేసినారు మంత్రి స్పందించి ముఖ్యమంత్రి దృష్టికు తీసుకు వెళ్తానని తెలిపారు. కృతజ్ఞతలు తెలిసిన దళిత సంఘాల నాయకులు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ బొమెర శ్రీను షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా దళితులను అధికారానికి దూరంగా విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో వివక్ష చూపిస్తూ అభివృద్ధికి మూసుకొని దళిత వాడలను ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ఎస్సీ దళితవాడల అభివృద్ధికి ఉపయోగపడేలా భవిష్యత్తు రోజుల్లో దళితవాడలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయటం వలన అభివృద్ధి జరుగుతుందని మంత్రి సీతక్కకు విజ్ఞప్తి చేశారు ఈకార్యక్రమంలో కుక్క ముడి సంపత్ దేవరకొండ కిరణ్ ఎనగంటి శ్రీనివాస్ రాచమల్ల నరసయ్య ఉండేటి దేవరాజ్ కండె రాములు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లిలో ఫోటో గ్రాఫర్ పై దాడిని ఖండిస్తూ...
# సంస్థాన్‌లో ఫోటో గ్రాఫర్స్ నిరసన



సంస్థాన్ నారాయణపుర్, మే 29( సూర్య ప్రతినిధి ): యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండలం కేంద్రంలో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ఓరుగంటి లింగస్వామి ఆధ్వర్యంలో మేడిపల్లిలో ఫోటోగ్రాఫర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ స్థానిక చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం సేవించి మొబైల్ లో ఫోటో తీయాలని కోరుడంతో ఫోటో గ్రాఫర్ తన వృత్తి తాను చేసుకుంటూ ఉన్న సమయంలో ఫోటో తీయలేదని మద్యం సేవించి ఫోటో గ్రాపర్ మీదకు వచ్చి ఫోటోగ్రాఫర్స్ పై అనుచిత వాక్యలు చేసి మాట్లాడుతూ దాడి చేయడం జరిగింది. ఇలాంటి దాడులను అరికట్టి దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ఫోటోగ్రాఫర్స్ తరపున కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపుర్ ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ జిల్లా ఉపాధ్యక్షులు పాలకూర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి పాషా, చిలివేరు శంకర్, చిలువేరు శేఖర్, చిలువేరు సాయిబాబా, నీళ్ల రాజు, గంగాపురం సాయి గౌడ్,గడ్డం రాజు,మొగుదాల ప్రదీప్, నీళ్ల కిరణ్, వంగరి సాయి, బొంగు మధు, విరమళ్ల శ్రవణ్,గంటిల సాయి తదితరులు పాల్గొన్నారు

# నేడు కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయండి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య

**భువనగిరి, మే 29( సూర్య ప్రతినిధి ):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, చట్ట పరిరక్షణ కోసం నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ఉపాధి హామీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని ముస్త్యాలపల్లి గ్రామంలో ధర్నాను జయప్రదం చేయాలని కూలీలతో కలిసి కరపత్రమును ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అంజయ్య పాల్గొని మాట్లాడుతూ సంవత్సరానికి 200 వందల రోజుల పని దినాల కోసం, రోజు కూలీ ఆరువందల కోసం, చట్టంలో ఉన్న హామీలు అన్ని అమలు చేయాలని, వేతనాలు వారం వారం ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రేపు అనగా 30వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలు ఉపాధి హామీ కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేసి చట్టాన్ని పరిరక్షించుకోవాలని అంజయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ



కార్మిక సంఘం నాయకులు కళ్లెం లక్ష్మీనరసయ్య, వ్యవసాయ కూలీలు బోడ అంజయ్య, గంటెపాక బాలయ్య, పసునాది కిష్టయ్య, బోడ ఉపేంద్ర, గంటపాక అంజమ్మ, పసనాది లక్ష్మి, చిట్యాల యాదమ్మ, పసనాది లావణ్య, సురపంగా రేణుక, వడ్డే ఆగమ్మ, గడ్డం జయమ్మ, పసునాది మనమ్మ, పల్లపు లక్ష్మి, కళ్లెం సోలేమాన్ తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ప్రశాంతతను యోగాతో జయించవచ్చు








**సంస్థాన్ నారాయణపుర్, మే 29( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో 11వ ప్రపంచ యోగ దినోత్సవాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నటువంటి అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు "యోగ సమావేశం" కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగినది. ఈ "యోగ సమావేశం" కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ నారాయణపుర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆవుట కవిత పాల్గొని యోగా సమావేశ కార్యక్రమాన్ని యోగ ఇన్స్పెక్టర్లు సిలివేరి సైదులు సరిత ఆర్కే నాయుడు తో కలసి నిర్వహించడం జరిగినది. యోగ యొక్క ప్రాముఖ్యతను ఉపయోగాలను అక్కడ ఉన్నటువంటి చిన్నారులకు వివరించడం జరిగింది. ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని ఉదయం యోగ ఆసనాలు, ప్రాణాయా మాలు చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చక్కటి శరీర ఆకృతిని సంపాదించుకోవాలని మానసిక ప్రశాంతతను, ఒత్తిడిను యోగాతో జయించవచ్చని నిరూపితమైందని ప్రతి ఒక్కరూ యోగ ఉపయోగించుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేదిక్ వైద్యశాల డిస్పెన్సరీ నారాయణపుర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆవుట కవిత, యోగ ఇన్స్పెక్టర్లు సిలువేరు సైదులు, సరిత,ఆర్కే నాయుడు, ఆశా వర్కర్లు,పారిజాత,సుమలత, క్రాఫ్ట్ టీచర్ శివరంజని, శ్రావణ్, గణేష్,మురళి,సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# గుడి మల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ లో సీసీ కెమెరాల ఏర్పాటు

### గుడి మల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ తలారి మల్లేష్ ముదిరాజ్

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** సీసీ కెమెరాల ఏర్పాటుతో గుడి మల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ లో నిఘా వ్యవస్థ మరింత పటిష్టమైందని గుడి మల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ తలారి మల్లేష్ ముదిరాజ్ అన్నారు. మార్కెట్‌లో రూ. 17.5 లక్షలతో 92 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు, వినియోగదారులకు ఎల్లప్పుడూ మంచి జరిగేలా చేయడం కోసం ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసామని అన్నారు. దీంతో మార్కెట్ యార్డులో జరిగే అక్రమాలను, దొంగతనాలను అరికట్టవచ్చని తెలిపారు. తమ పాలకవర్గం, ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల శ్రేయస్సు కొరకు అన్ని విధాలుగా ముందుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మున్వర్, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, కావాలి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, ట్రాఫిక్ సిఐ అంజయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ కమిటీ పాలకవర్గ సభ్యులు ఎల్ శ్రీనివాస్, కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



# బాబుల్ రెడ్డి నగర్‌లో సమస్యలను పరిష్కరించాలని

## మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ






**గండిపేట్,: సూర్య ప్రతినిధి**

మైలార్ దేవ్ పల్లి డివిజన్ బాబుల్ రెడ్డి నగర్‌లో ప్రజల సమస్యలను అధికారులు పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ కురుమ అన్నారు. గురువారం ఆయన బిఆర్ఎస్ నాయకులతో కలిసి బాబుల్ రెడ్డి నగర్ లో పర్యటించారు. అందులో భాగంగా ఎక్కడ చూసినా దుర్గంధంతో నిండిన రోడ్ల మధ్యలో నోరు తెరుసుకున్న మూత లేని మ్యాను హెూళ్లు, ప్రాణాలు తీసే విధంగా రోడ్డు మధ్యలోనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లు, ఇప్పుడా అప్పుడా పడిపోయే విధంగా వంగి ఉన్న విద్యుత్ స్తంభాలు పడిపోకుండా తడుతో కట్టినట్లు తెలిపారు. ఆరు మాసాల క్రితం స్వయంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలిసి బాబుల్ రెడ్డి నగర్ లో పర్యటన నిర్వహించారు. పర్యటనలో భాగంగా దేవుడు వరమిచ్చిన పూజారి కనికరించలేదు అన్నట్లు స్వయంగా ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేసినా గాని బాబుల్ రెడ్డి నగర్ ను అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఎలక్ట్రికల్ అధికారులు ప్రాణ నష్టం జరగకముందే




ట్రాన్స్ఫార్మర్ ను వేరే చోటికి మార్చి పడిపోయే విధంగా ఉన్న పాతకాలపు స్తంభాలను మార్చి అదే స్థానంలో కొత్తవి వేయాల్సిందిగా ప్రజలు కోరుకుంటున్నారు. అధికారులు గానీ, కాంట్రాక్టర్లు గానీ ఒక ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా అడ్డదిడ్డంగా రోడ్లు వేసి ఆ రోడ్లో దేనికి ఉపయోగకరంగా లేకుండా బాబుల్ రెడ్డి నగర్ లో రోడ్లు వేశారన్నారు. ఆరు మాసాల క్రితం తొవ్విన మట్టి కుప్పలను ఎత్తుకొని వెళ్లకపోవడంతో మట్టి కుప్పలు స్మశానవాటికల్లా దర్శనమిస్తున్నాయన్నారు. కనీసం పాదచారులకు, వాహనాలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారినా, రోడ్లు లక్షలు కోట్లు ఖర్చు పెడుతున్నప్పటికీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకుండా కాంట్రాక్టర్లు మధ్య రాత్రుల్లో ఇష్టానుసారంగా, నాసిరకం రోడ్లు వేసి చేతులు దులుపుకొని వెళ్లిపోతున్నారని ప్రజలు మండిపడుతున్నారన్నారు. ఇప్పటికైనా నాసిరకం పనులు చేస్తున్న పనులను, మొండికేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు రాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్త, మైసిరెడ్డి, ఎడ్ల కాడి సూర్యం,చిరంజీవి, జీ.రాజు, హనుమంతు, కార్తీక్, వెంకటరమణ, ఉప్పల్ శీను, అశోక్ కుమార్, భూదేవి, సరితా, మహేష్, అరుణ రెడ్డి, కిషోర్, సందీప్, సునీల్, రమేష్, రాజ్ కుమార్, రవి, తిమ్మి గిర్నిరాజు, రవీందర్ రెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మణికొండలో సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ ధ్యేయం

## మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ





**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మణికొండ మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బిఆర్ఎస్ పార్టీ పని చేస్తుందని మణికొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సీతారం ధూళిపాళ అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజా సమస్యలు తెలుసుకుంటూ అల్కాపూర్ టౌన్షిప్ లో పర్యటిస్తున్న సందర్భంగా దృష్టికి తీసుకువచ్చారు. అందులో భాగంగా లక్షలు పోసి మంచినీటి కనెక్షన్లు తీసుకొని చివరకు ప్రతినిత్యం ట్యాంకర్ల మీదే ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడిందని, ట్యాంకర్లకు వేలకు వేలు ఖర్చు చేయడం జరుగుతోందని తెలిపారన్నారు. స్పోర్ట్స్ పార్కులో నిర్మించిన 2.5 ఎంఎల్‌డీ మంచినీటి రిజర్వాయర్ ప్రారంభోత్సవం కేవలం కాగితాలకే పరిమితమై, మంచినీటి వసతి కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజానికానికి మంచినీరు అన్నది కంటి తుడుపు చర్యగానే మిగిలిపోయిందన్నారు. మంచినీటి కనెక్షన్ కొరకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ యాక్ట్ ప్రకారం అవసరం లేకున్నను వాల్వుల పేరుతో వేలకు వేలు కట్టించుకొని నెలలు తరబడి కనెక్షన్ ఇవ్వకుండా మీనమేషాలు లెక్కించడం శోచనీయమన్నారు. గతంలో ఉన్న అధికారులు సాంకేతికపరంగా ఒక ఇంచ్ కనెక్షన్ ఇవ్వాల్సిన చోట ఇవ్వడం కుదరదని, అర ఇంచు కనెక్షన్లు మాత్రమే ఇచ్చి నీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. అల్కాపూర్ టౌన్షిప్ లో నీటి సరఫరా జరుగుతున్న విధానంపై సమగ్ర విచారణ జరగవలసిన అవసరం ఎంతైనా ఉంది కావున హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ వారు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంభగల్ల వర్కింగ్ ప్రెసిడెంట్ ధనరాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, బొమ్మ ఉపేందర్నాథ్ రెడ్డి, గోరుకంటి విఠల్, సంగం శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, భానుచందర్, బాబు, సుమనళిని, షేక్ ఆరీఫ్, ఆరీఫ్ మొహమ్మద్, చెరుకూరి బాలాజీ, కందాడ ప్రవీణ్, యాలాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన యుపిఎఫ్ నేతలు

## "విద్యార్థులతో బాత్రూంలు కడిగిస్తారా? ఇదేనా సామాజిక న్యాయం?" బొల్ల శివశంకర్ ప్రశ్న

**కామారెడ్డి, సూర్య ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలోని రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లోని విద్యార్థులతో బాత్రూంలు కడిగిస్తున్న ఘటనపై తీవ్రంగా మండిపడుతూ యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్ (యుపిఎఫ్) నేతలు సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్దకి వెళ్లి వినతిపత్రం సమర్పించిన యుపిఎఫ్ నేతలు, ప్రభుత్వం వెంటనే మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులపై జరుగుతున్న వివక్షను ఆపాలని డిమాండ్ చేశారు. "పోషకాహారంలో విఫలం, శానిటేషన్ ఉద్యోగుల తొలగింపు వల్ల విద్యార్థులే బాత్రూంలు కడుగుతున్న పరిస్థితి వచ్చింది. ఇది విద్యా వ్యవస్థపై అవమానకరమైన మచ్చ" అని యుపిఎఫ్ కో కన్వీనర్ బొల్ల శివశంకర్ విమర్శించారు. అలాగే, బిక్నూర్ ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్లో ఒక అధికారి చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందిస్తూ, "వీరు పోషణ, గౌరవాన్ని కాదని, 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' పేరుతో వెట్టిచాకిరిని న్యాయీకరిస్తున్నారు. ఇలాంటి అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలి. సీఎం రేవంత్ ఈ వర్గాలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు. యుపిఎఫ్ విద్యార్థి కన్వీనర్ డా. ఎల్చాల దత్తాత్రేయ మాట్లాడుతూ, "బ్లాక్ బోర్డు తుడవడం, బాత్రూం కడగడం ఒకేలా ఎలా అవుతాయి? తల్లిదండ్రుల గురించి హేళనగా మాట్లాడటం విద్యార్థుల గౌరవాన్ని తూర్పారబోస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధం" అన్నారు. ఎంబీసీ కులాల అధ్యక్షుడు నరహరి మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ బీసీలను తెలంగాణలో కలపాలని కాంగ్రెస్ కుట్ర చేస్తోంది. ఇది వ్యతిరేకతను రగిలించే చర్య. ప్రభుత్వ తీరుపై పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం" అని హెచ్చరించారు. సల్వా చారి మాట్లాడుతూ, "ఇది సామాజిక న్యాయంపై దాడి. విద్యార్థులను మనుషుల్లా చూడని ప్రభుత్వానికి మానవత్వం లేదు" అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యుపిఎఫ్ నేతలు గోపు సదానందం, ఆలకుంట్ల హరి, పెద్దాపురం కుమారస్వామి, ఎత్తరి మారన్న, స్వామి, రమేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ మున్సిపల్ ఉపాధ్యక్షులుగా గుండెబోయిన వేణు యాదవ్



**చౌటుప్పల్,మే 29( సూర్య ప్రతినిధి ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ బిజెపి నూతన కమిటీ విస్తరణలో భాగంగా గురువారం నూతన కమిటీని మున్సిపల్ అధ్యక్షురాలు కడారి కల్పన ప్రకటన చేశారు. ఈ కమిటీలో భాగంగా బీజేపీ మున్సిపల్ ఉపాధ్యక్షులుగా తంగడపల్లికి చెందిన గుండెబోయిన వేణు యాదవ్ నియమించారు. నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుండెబోయిన వేణు యాదవ్ మాట్లాడు తూ.. వారి ఎన్నికకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజులలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు చినుకని మల్లేష్ యాదవ్,జిల్లా కార్యదర్శి ఆలే చిరంజీవి,మండల అధ్యక్షులు కె. అశోక్,అసెంబ్లీ కన్వీనర్ డి. బిక్షం,రమణగోని శంకర్, కె. ఐలయ్య,బి సత్యం, డి భాస్కర్, కె కృష్ణ, పి వంశీ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలి

### అనుమతిలేని స్కూల్ లపై చర్యలు తీసుకోవాలి

### టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల దోపిడీని అరికట్టి, అనుమతిలేని స్కూల్ లపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీ నివాస్ అన్నారు. టీఎస్ఎస్ఓ రంగారెడ్డి జిల్లా ఆరాంఘర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, బట్టలు,పెన్నులను విద్యా సంవత్సరం ప్రారంభమౌతున్న సమయంలో విచ్చలవిడిగా దందాను కొనసాగిస్తారన్నారు. వాటిపై చర్యలు తీసుకునే విధంగా, దానిపై వెంటనే టాస్క్ ఫోర్స్ వేసి ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసి వాటిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను మభ్యపెట్టి లక్షల రూపాయలు ఫీజులను దోచుకుంటున్న ప్రైవేట్ పాఠశాలలను గుర్తించి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్, టీఎస్ఎస్ఓ రాష్ట కో–ఆర్డినేటర్ కర్రే సుదర్శన్, టీఎస్ఎస్ఓ రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి మీసాల వర్షిత్, టీఎస్ఎస్ఓ రాష్ట్ర నాయకులు సుధాకర్ సంపత్, గడ్డం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలి

### రాజేంద్రనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** అగ్ని ప్రమాదాల నివారణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని రాజేంద్రనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్ సూచించారు. ఈ మేరకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శివరాంపల్లి కేన్ వర్త్ అపార్ట్మెంట్స్ సముదాయాలలో రాజేంద్రనగర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ చంద్ర నాయక్ ఆధ్వర్యంలో ప్రజలకు అగ్నిమాపక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై భద్రతపై అవగాహన కలిగించారు.

## బీజేఎంసీలో నీరు వృథా కాకుండా చొరవ

### మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, టింకురెడ్డిలు




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని హైదర్‌షా కోట్ శాంతి నగర్ రోడ్డుపై నీరు వృథా కాకుండా స్థానికులు టింకురెడ్డి నీటిని ఎర్రకుంటలోకి చేరేందుకు చేసిన ఏర్పాట్లను మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి ప్రశంసించారు. ఈ మేరకు గురువారం సీసీ రోడ్డు, స్పీడ్ బ్రేకర్ పూర్తి చేసేందుకు శంకుస్థాపన పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా టింకు రెడ్డి మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వర్షంనీరుతో ఎర్రగుంట నిండుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పనికి సహకరించిన ఎమ్మెల్యేకు, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు ధన్యవాదాలు తెలిపారు. వృథాగా వెళ్లకుండా ఎర్రకుంట చెరువులోకి నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సంతోష్ ముదిరాజ్, లక్ష్మీనగర్ కాలనీ ప్రెసిడెంట్ రవికాంత్ రెడ్డి, భాగ్యనగర్ కాలనీ ప్రెసిడెంట్ పిఎస్ గోపాలా చారి, సెక్రెటరీ విశ్వనాథం, సురేందర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# నార్త్ అబ్బాయి, సౌత్ అమ్మాయి ప్రేమ..

## ఇంట్రెస్టింగ్‌గా జాన్వీ కపూర్ 'పరమ్ సుందరి' టీజర్

బాలీవుడ్ నటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రా కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ చిత్రం 'పరమ్ సుందరి' ఫస్ట్ లుక్ టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని తుషార్ జలోటా ('దాస్వి' ఫేమ్) దర్శకత్వం వహించారు. ఈ చిత్రం నార్త్ ఇండియాకు చెందిన 'పరం' (సిద్ధార్థ్ మల్హోత్రా), సౌత్ ఇండియాకు చెందిన 'సుందరి' (జాన్వీ కపూర్) మధ్య ప్రేమకథగా సాగనుంది. వీరిద్దరి మధ్య సాంస్కృతిక భేదాలు, హాస్యభరితమైన సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో రాజీవ్ ఖండేల్వాల్, ఆకాష్ దహియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'పరమ్ సుందరి' చిత్రం జూలై 25, 2025న థియేటర్లలో విడుదల కానుంది. ఈ టీజర్‌లో కేరళలోని అందమైన బ్యాక్‌వాటర్స్, హౌస్‌బోట్‌ల నేపథ్యం అద్భుతంగా ఉంది. సిద్ధార్థ్, జాన్వీ ఒక బైక్‌పై రొమాన్స్ చేస్తూ కనిపించారు. బ్యాక్‌గ్రౌండ్‌లో సోను నిగమ్ ఆలపించిన మధురమైన పాట హైలైట్‌గా నిలిచింది.



# 20 నిమిషాల పాత్రకి 20కోట్లట..

## పదేళ్ల క్రితం హీరో పాత్రకి అదే పారితోషికం

సినిమా రంగం ఎవరిని ఎప్పుడు నెత్తికి ఎక్కించుకుంటుందో ఎవరిని నేలకేసి కొడుతుందో అంచనా వేయడం అంత సులభం కాదు. అందుకు నిదర్శనంగా మన తెలుగు హీరోను చెప్పొచ్చు. వయసులో ఉన్నప్పుడు ఉరకలేసే ఉత్సాహంతో ఫైట్లూ, డ్యాన్సులూ వేసినా సమకాలికులైన హీరోలపై సాధించలేకపోయిన పైచేయిని..సక్సెస్‌నూ వృద్ధాప్యంలో సాధిస్తూ ఆశ్చర్యపరుస్తున్నాడు బాలకృష్ణ. ఇటవలి కాలంలో సీనియర్ నటుల్లో బాలకృష్ణ అందుకుంటున్న విజయాలు మరెవ్వరికీ సాధ్యం కావడం లేదనేది వాస్తవం. నిజానికి యుక్తవయసులో ఉండగా కూడా బాలయ్య ఇంత సందడి చేయలేదని చెప్పొచ్చు. వయసులో ఉండగా చేయలేకపోయిన యాడ్స్‌లో కూడా ఆయన ఇప్పుడు సత్తా చాటుతుండడం దీనికో నిదర్శనం. ఈ నేపథ్యంలో తాజాగా సినీరంగంలో హల్‌చల్ చేస్తున్న ఒక వార్త మరోసారి బాలకృష్ణ సరికొత్త స్టామినాను చాటి చెబుతోంది. అదేమిటంటే జైలర్ 2 సినిమాలో అతిధి పాత్రలో బాలకృష్ణ కనిపించబోతున్నాడని, అందుకు గాను అత్యధిక పారితోషికం అందుకుంటున్నారని.. కేవలం 20 నిమిషాల నిడివి ఉండే పాత్ర కోసం బాలకృష్ణ ఏకంగా రూ.20కోట్లకు పైనే రెమ్యునరేషన్ ఇవ్వడానికి జైలర్2 నిర్మాతలు ఓకే అన్నారని తెలుస్తోంది. ఈ సమాచారం ఒక్కసారిగా టాక్ ఆఫ్ ద ఇండస్ట్రీగా మారింది. ఒకప్పుడు అంటే దాదాపుగా ఒక పదేళ్ల క్రితం డిక్టేటర్ వంటి సినిమాల్లో నటించే సమయంలో బాలకృష్ణ మొత్తం సినిమాకి తీసుకున్న రెమ్యునరేషన్ కూడా దాదాపుగా అంతే ఉంటుందని సినిమా వర్గాలు చెబుతున్నాయి. ఒక సినిమా మొత్తం కనిపించే హీరోగా పదేళ్ల క్రితం తీసుకున్న పారితోషికాన్ని ఇప్పుడు కేవలం 20 నిమిషాల పాత్ర కోసం తీసుకుంటూ బాలకృష్ణ కొత్త రికార్డ్ సాధించారని చెప్పొచ్చు. మొదటి నుంచీ నిర్మాతలకు అందుబాటులో ఉండే హీరోగా బాలకృష్ణకు పేరుంది. జయాపజయాలతో సంబంధం లేకుండా పారితోషికం రూపంలో నిర్మాతల నెత్తిన భారం మోపే వాడు కాదని అందుకే ఎన్ని ఫ్లాపులొచ్చినా బాలకృష్ణ చేతిలో సినిమాలు లేని పరిస్థితి ఎప్పుడూ లేదని అంటుంటారు. అంతెందుకు ఆయన రెమ్యునరేషన్ అమాంతం పెరిగిన ఈ పదేళ్లలో చూసుకున్నా... బాలకృష్ణ కెరీర్‌లో విజయాలకన్నా అపజయాలే ఎక్కువ.




# నెక్స్ట్ లెవల్‌లో అజిత్‌కుమార్ ఏకే 64

కోలీవుడ్ స్టార్ యాక్టర్ అజిత్‌కుమార్ కు సంబంధించి ఎప్పుడూ ఏదో ఒక అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతూ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ స్టార్ యాక్టర్ నటిస్తున్న కొత్త ప్రాజెక్టు ఏకే 64 తాజాగా ఈ మూవీపై ఓ ఆసక్తికర వార్త తెరపైకి వచ్చి అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఈ చిత్రాన్ని టాలీవుడ్ టాప్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుందని తెలిసిందే. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించబోతున్న ఈ మూవీకి మ్యూజిక్ సెన్సేషన్ జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. తాజా వార్తల ప్రకారం ఏకే 64 ఈ ఏడాది అక్టోబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 2026 వేసవిలో విడుదల కానుంది. కాగా ఈ సినిమాను అధిక్ రవిచంద్రన్ మరో లెవల్‌కు తీసుకెళ్లేలా తెరకెక్కించబోతున్నాడట. ఈ చిత్రంలో పాపులర్ అందాల భామలు పూజా హెగ్డే, నయనతారను ఫీ మేల్ లీడ్ రోల్ కోసం తీసుకునే విషయాన్ని మేకర్స్ పరిశీలిస్తున్నట్టు ఇండస్ట్రీ సర్కిల్ క్రేజీ టాక్. ఇదే నిజమైతే సిల్వర్ స్క్రీన్‌పై ఈ సారి అజిత్‌కుమార్ ఎలా కనిపించబోతున్నాడని సస్పెన్స్ నెలకొంది. గుడ్ బ్యాడ్ అగ్లీ, విదాముయార్చి సినిమాల తర్వాత అజిత్‌కుమార్ నుంచి రాబోతున్న ప్రాజెక్ట్ కావడంతో ఏకే 64పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# విడుదల తేదీ ప్రకటించిన రవితేజ 'మాస్ జాతర'

మాస్ మహారాజా రవితేజ ఇటీవల కాలంలో సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 'ధమాకా' తర్వాత ఆయనకు పెద్ద హిట్ దక్కలేదు. గతేడాది విడుదలైన ఈగల్, మిస్టర్ బచ్చన్ చిత్రాలు ఆశించిన విజయాన్ని సాధించలేకపోయాయి. ఈ నేపథ్యంలో, రవితేజ ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో ఉన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. ఈ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. రవితేజ సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తోంది. వీరిద్దరూ గతంలో 'ధమాకా'తో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'మనదే ఇదంతా' అనే ట్యాగ్ లైన్‌తో వస్తున్న ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ తాజాగా ప్రకటించారు. ఈ సినిమాను వినాయక చవితి కానుకగా.. ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాలో రవితేజ క్లాసిక్ పాటలలో ఒకటైన ఇడియట్ సినిమాలోని చూపులతో గుచ్చి గుచ్చి చంపకే పాటను ఇందులో రీమిక్స్ చేస్తున్నట్లు సమాచారం. ఇక టైటిల్‌కు తగినట్లుగానే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండబోతుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్నందిస్తున్నారు.



# తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన గద్దర్ ఫిల్మ్ అవార్డులపై అల్లు అర్జున్ స్పందించారు. పుష్ప 2 చిత్రానికి ఉత్తమ నటుడిగా తనను ఎంపిక చేయడం గౌరవంగా ఉందన్నారు. ఈ గౌరవాన్ని కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు సుకుమార్, నిర్మాతలతో పాటు పుష్ప టీమ్ మొత్తానికి ఈ ఘనత దక్కుతుందని చెప్పారు. ఈ అవార్డును తన అభిమానులకు అంకితం చేస్తున్నట్లు అల్లు అర్జున్ ప్రకటించారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ కూడా గద్దర్ అవార్డులపై స్పందించారు. సినిమా వాళ్లకు తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. దేవర చిత్రానికి గాను ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా అవార్డు గెలుచుకున్న గణేష్‌తో పాటు విజేతలందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, 2024 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను గురువారం ప్రకటించింది. మొత్తం 11 కేటగిరీల్లో వీటిని వెల్లడించారు. 2024కు సంబంధించి అన్ని కేటగిరీల్లోనూ అవార్డుల వివరాలను గురువారం జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ వెల్లడించారు. బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో మూడు చిత్రాలకు అవార్డులు ప్రకటించారు. అందులో మొదటి చిత్రం కల్కి , రెండో చిత్రంగా పొట్టేల్, మూడో చిత్రంగా లక్కీ భాస్కర్ ఎంపికైంది. ఇక ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్(పుష్ప 2), ఉత్తమ నటిగా నివేధా థామస్ ( 35 చిన్న కథ కాదు) అవార్డుకు ఎంపికయ్యారు. జూన్ 14న ఈ అవార్డులను అందిస్తారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.